# ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించం

-మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ
-ఫుడ్ తయారీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ
-నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరిక



సూరారంలోని పిండివంటలు తయారీ చేసేకేంద్రాల్లో తనిఖీ చేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ

హైదరాబాద్, జనవరి 22,ప్రభాతవార్త: నాణ్యత ప్రమాణాలు పాటించకుండా కల్తీ, అపరిశుభ్ర ఆహార పదార్థాలు తయారీ చేసి ప్రజల ఆరోగ్యం, ప్రాణాలతో చెలగాటమాడితే సహించబోమని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ హెచ్చరించారు. ఈమేరకు బుధవారం కూకట్ పల్లి జోన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ సర్కిల్ సూరారం ప్రాంతంలో గల పలు పిండి వంటల , స్వీట్స్ తయారీ కేంద్రాలనును ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈసందర్భంగా మేయర్ ఆయా షాప్‌లో తయారు చేసి అమ్మకానికి ఉన్న నాణ్యత లేని సరుకులను, అపరిశుభ్ర వాతావరణములో తయారు చేస్తున్న పిండి వంటకాలు, ఆహార పదార్థాల తయారీలో కనీస నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడాన్ని గుర్తించారు. పిండి, పప్పులు, తదితర సరుకుల పై తయారు తేదీ, ఎక్స్ పరీ తేదీ లేకపోవడాన్ని గమనించి, నిల్వలకు సంబంధించి నిబంధనలు ఉల్లంఘనల పై ప్రశ్నించారు. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం, కాలపరిమితి ముగిసిన సరుకులు నిల్వ చేయడం వంటి అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం మా ప్రాధాన్యతని అన్నారు. నాణ్యత లేని ఆహార పదార్థాలు కొని తింటూ పిల్లలు, పెద్దలు ఫుడ్ పాయిజనింగ్ కు, అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు బయటి ఫుడ్ తినేటప్పుడు ఆలోచించాలని సూచించారు. నాణ్యతలేని సరుకుల అమ్మకంపై జిహెచ్ఎంసి కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యానికి హానికరమైన ఆహార పదార్థాల అమ్మకాన్ని నిరోధించేందుకు ఈ తనిఖీలు కొనసాగుతాయని మేయర్ తెలిపారు. ఇలాంటి వస్తువులు వినియోగించుకునే సందర్భంలో ప్రజలు ఆలోచించాలన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలకు వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు ఆలోచన చేయాలన్నారు.ఈతనిఖీల్లో అడిషనల్ కమీషనర్ హెల్త్ పంకజ, జిహెచ్ఎంసి ఫుడ్ సహాయ కంట్రోల్ ముత్యం రాజు, ఫుడ్ సేఫ్టీ అధికారి లక్ష్మీ కాంతం, చీఫ్ సిఎంఅండ్హెచ్ ఓ డాక్టర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్ తదితరులు పాల్గొన్నారు.

# తులం బంగారం ఎప్పుడిస్తున్నారో స్పష్టం చేయాలి

-సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



కళ్యాణలక్ష్మీ ,షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని

బేగంపేట జనవరి 22,ప్రభాతవార్త ఎన్నికల ముందు తులం బంగారం ఇస్తామంటూ ప్రజలకు హామీ ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు తులం బంగారం ఎప్పుడిస్తారో స్పష్టం చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రశ్నించారు.బుధవారం బేగంపేట లోని సికింద్రాబాద్ తహశీల్దార్ కార్యాలయంలో 108మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ,షాదీముబారక్ లబ్దిదారులకు ఆర్థిక సహాయం చెక్కులు పంపిణీ చేసారు.ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ ఎన్నికల ముందు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఇవ్వడం లేదని లబ్దిదారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రావడంతో ఆయన పై విధంగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.పేద,మధ్యతరగతి కుటుంబాలలో ఆడబిడ్డ పెండ్లి అంటే ఆర్థికంగా ఎంతో భారమని పేర్కొన్నారు.వారికి కొంత ఆసరాగా ఉండాలనే సదుద్దేశ్యంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక లక్ష 116రూపాయల ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించి,కళ్యాణ లక్ష్మీ,షాదీముబారక్ కార్యక్రమం చేపట్టారని తలసాని గుర్తు చేసారు.లక్షలాది కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం అదించినట్లు తెలియజేసారు.సంక్షేమ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు టి.మహేశ్వరి శ్రీహరి,కుర్మ హేమలత,తహశీల్దార్ పాండు నాయక్,మాజీ కార్పొరేటర్ అత్తెల్లి మల్లిఖార్జున్ గౌడ్ ,నాయకులు టి.శ్రీహరి,ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.


## రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

-శివరాంపల్లిలో విద్యార్థుల భారీ ప్రదర్శన




అత్తాపూర్ జనవరి22,ప్రభాతవార్త : రోడ్డు భద్రతా నియమాలను పాటించటం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని ఎంఈఓ శంకర్ రాథోడ్ ,ఎంవిఐ సిఐ కృష్ణవేణి,ఎఎంవిఐ శ్రీముఖీలు పేర్కొన్నారు. విద్యాశాఖ, పోలీసు, ట్రాఫిక్ శాఖల ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ మండల పరిధిలోని శివరాంపల్లి జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా వందలాది విద్యార్థిని విద్యార్థుల ర్యాలీ నిర్వహించారు.ఈ మేరకు ప్రమాదాలకు సంబంధించిన ప్లకార్డులను ప్రదర్శించారు.ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ శంకర్ రాథోడ్ ,ఎంవిఐ సిఐ కృష్ణవేణి,ఎఎంవిఐ శ్రీముఖీలు మాట్లాడుతూ...ప్రతి వ్యక్తి వాహనాల్లో ప్రయాణించేటప్పుడు కచ్చితంగా గుర్తుపెట్టుకోవాల్సి న అంశాలలో హెల్మెట్, సీటు బెల్ట్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయకుండా జాగ్రత్తలతో పాటు ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని రోడ్డు మీద వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు.విద్యార్థులు వాహనాలు నడిపి జీవితాలను కోల్పోవద్దని 21 సంవత్సరాల తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ పొంది వాహనాలను నడపాలని సూచించారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు ట్రాఫిక్ నిబంధనలను సూచించాలని వారు మద్యం తాగి డ్రైవింగ్ చేయొద్దని తెలపాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ రాములు,ట్రాఫిక్ ,సివిల్ ఎస్సైలు,జోనల్ సెక్రటరీ గంగయ్య నాయక్,పిడిలు హైస్కూల్ టీచర్స్,తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను పరామర్శించిన ఎంపి ఈటల



ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను పరామర్శించిన ఎంపీ ఈటెల రాజేందర్

అడ్డగుట్ట,జనవరి 22 ప్రభాతవార్త: సికింద్రాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్‌కు ఈ నెల 19న డేహ్రాడూన్ పర్యటనలో గుండెపోటు వచ్చింది. విషయం తెలుసుకున్న మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్, మోండా మార్కెట్ టకార బస్తీలో నివాసం ఉంటున్న పద్మారావు గౌడ్‌ను ఎంపీ ఈటెల పరామర్శించి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, బిజెపి నాయకులు బానుక మల్లికార్జున్,పిట్ల నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్‌గాంధీ క్రికెట్‌టోర్నిలో బీహార్‌పై చెన్నైజట్టు విజయం



హైదరాబాద్, జనవరి 22,ప్రభాతవార్త: 8వ రాజీవ్ గాంధీ ఆల్ ఇండియా అండర్ 19, 20-20 ఛాంపియన్షిప్ లో బీహార్ మరియు చెన్నై మ్యాచ్లో చెన్నై జట్టు విజయం సాధించింది. ఈసందర్భంగా మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును రైతు సంక్షేమ కమిషన చైర్మన్ కోదండ రెడ్డి చెన్నై ఆటగాడు కరణ్ కన్నన్‌కు అందజే శారు. ఈకార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు వి హనుమంతరావు రాష్ట్ర ఫిషరీ మెట్టు సాయికుమార్. మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్ గౌడ్ ఆర్ లక్ష్మణ్ యాదవ్, నాగభూషణం ఆర్గనైజింగ్ సెక్రటరీ శంభుల శ్రీకాంత్ గౌడ్, అఫ్సర్ యూసుఫ్ జాయి అమర్ జీత్ కుమార్, సయ్యద్ సాదిక్ పాషా పాల్గొన్నారు

## నల్లబెల్లం, స్పటిక విక్రయదారుల అరెస్టు

-నలుగురు అరెస్టు ఇద్దరు పరారీ
-మూడు వాహనాలు,నగదు, నాలుగు ఫోన్ల సీజ్



నిందితులతో ఏసీపీ కిషన్

ఎల్.బి.నగర్, జనవరి 22 ప్రభాతవార్త: నిషేధిత సారాయి తయారీకి ఉపయోగించే నల్ల బెల్లం స్పటిక విక్రయదారులను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ .5.24లక్షల విలువగల నల్ల బెల్లం, స్పటిక, రూ.1.07 లక్షల నగదు, మూడు వాహానాలు, 4 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్టు చేయగా ఇద్దరు పరారీలో ఉన్నారు. ఈ సంఘటన సరూర్ నగర్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బుధవారం సరూర్నగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రంగారెడ్డి జిల్లా డివిజన్ ఏసిపి కిషన్ వివరాలను వెల్లడించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అక్రమ సారాయిని తయారు చేయకుండా అరికట్టాలని ఎక్సైజ్ కమిషనర్ కమలహాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిషేధిత నల్ల బెల్లం, పట్టికను విక్రయిస్తున్నట్లు తెలియడంతో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు, సిబ్బంది పహాడీషరీఫ్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న డీసీఎంను తనిఖీ చేశారు. కర్ణాటక నుండి హైదరాబాద్ పహాడిషరీఫ్‌కి డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న రూ.12.50లక్షల విలువచేసే 7860కిలోల నల్లబెల్లం, 40కిలోల స్పటిక లభ్యమయ్యిందన్నారు. ఒక డీసీఎం, రెండు ఆటోలు, రూ.1.07 లక్షల నగదు, 4 మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నల్లబెల్లం, స్పటిక తరలిస్తున్న నలుగురు నిందితులు శివకాంత్(45), కేతావత్ అరుణ్ నాయక్(25), సభవాత్ హీర్యాసింగ్(32), డ్రైవర్ మహమ్మద్ బాబా (40)లను అదుపులోకి తీసుకొని అరెస్టు చేశామన్నారు. కాగా రామవాత్ నరేష్(24), కేతావాత్ శ్రీనునాయక్(40)లుపరారీలో ఉన్నారన్నారు. పహడిషరీఫ్‌లోని ఒక గోదాం వద్ద డీసీఎం నుండి ఆటోలకు అక్రమంగా డంపు చేస్తున్నట్లు పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏఈఎస్ జీవన్‌కిరణ్, ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, బాలరాజు చంద్రశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

## గంజాయిని తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్



గంజాయిని పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

ముషీరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త: గంజాయిని అమ్మేందుకు తరలిస్తుండగా ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జార్ఖండ్ నుండి ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి, కూలీ పనులు చేసుకుంటూ, ఆటో నడుపుకుంటున్న గుడ్డు కుమార్, చేతు కుమార్‌యాదవ్‌లు ఆదాయం సరిపోకపోవటంతో గంజాయి అమ్మకాలను ప్రారంభించారు. ఒరిస్సా నుండి తీసుకు వచ్చిన గంజాయిన ఆటోలో ముషీరాబాద్ ప్రాంతానికి తీసుకువెళ్తున్నారనే సమాచారం మేరకు ఎన్టీఆర్ స్టేడియం వద్ద ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు చాకచక్యంతో పట్టుకున్నారు. వారి వద్ద నుండి 6.015 కేజీల గంజాయిని, ఒక మెబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. గంజాయిన పట్టుకున్న వారిలో కానిస్టేబుల్స్ సాయికుమార్, ధనలక్ష్మి, హైమ, అంబిక ఉన్నారు. గంజాయిని పట్టుకున్న ఎక్సైజ్ పోలీస్ సిబ్బందిని ఎన్‌పతిర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాసరావులు అభినందించారు.




హైదరాబాద్ వార్త


# నగర బస్తీల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు

-తెల్లవార్లూ అధిక ధరలతో మద్యం అమ్మకాలు
-నిత్యం నిషాలో మందుబాబులు
-చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు



హైదరాబాద్, జనవరి 22,ప్రభాతవార్త: మద్యం దుకాణాలు ,బార్ అండ్‌రెస్టారెంట్‌లు నిర్ణీత వ్యవధిలో మూత పడినా ..ఏటిఎం పద్ధతిలో మద్యపాన ప్రియులకు అందుబాటులో మద్యం లభ్యమవుతుంది. పగలు,రాత్రి తేడా లేకుండా మందుబాబులు నిత్యం నిషాలో తూగుతున్నారు. ఎక్కడపడితే అక్కడ అందుబాటులో బెల్ట్‌షాపులు వెలుస్తుండటంతో విక్రయాల జోరు హోరందుకుంది. మామూళ్లకు అలవాటు పడిన అధికారుల కనుసన్నల్లోనే కొనసాగుతున్నాయన్న ఆరోపణలూ వినిపిస్తున్నాయి.గ్రేటర్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో అక్రమవ్యాపారం జోరుగా సాగుతుంది. ఎక్కడచూసినా ఏకాలనీకి వెళ్ళినా బ్లాక్ అడ్డాలే దర్శనమిస్తున్నాయి. ఈఅడ్డాలు మినీ బార్లను తలపింపజేస్తున్నాయి. అర్ధరాత్రి వరకు విక్రయాలు ..తెల్లవారేవరకు మందుబాబుల వీరంగాలు కొనసాగుతున్నాయని ఆయా కాలనీల మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవక్క స్థానికంగా ఉన్న ఆయా వైన్స్‌ల పరిధిలో విక్రయిస్తున్న బ్లాక్ అడ్డాల విక్రయదారులు మద్యం అడ్డాల కోసం పోటీపడడం విశేషం.మద్యం అక్రమ విక్రయాలు బాహాటంగానే జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు చూస్తున్నారే తప్పా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. కిరాణం దుకాణాలు, మిల్క్‌బూత్‌లు మద్యం అడ్డాలకు కేంద్రబిందువులుగా మారాయి. ఈ కేంద్రాల లోపల మద్యం ప్రియులకు అనుకూలంగా అన్ని సౌకర్యాలు (తినుబండారాలు) కల్పిండంతో దినదినం మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మద్యం బ్లాక్అడ్డాలను గమనిస్తే అది ఓ మినీ బార్‌లనే తలపింపజేస్తున్నాయి. ఈవిక్రయాలు ఉదయం మొదలుకొని వేకువజాము వరకు నిరవధికంగా కొనసాగుతున్నాయని స్థానిక ప్రజలు తెలియజేస్తున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ వార్షిక ఆదాయానికి భారీగా గండి పడుతుంది.
ప్రధానంగా నిరుపేదలు ఉండే కాలనీల్లోనే ఈఅక్రమ బ్లాక్ అడ్డాలు అధికసంఖ్యలో వెలుస్తున్నాయి. సాయంత్రం అయ్యిందంటే మందుబాబులు పీకల దాక మద్యం సేవించి రోడ్లపై, గల్లీల్లో తూలుతూ వీరంగం సృష్టిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్తీల్లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకుని రాత్రి పూట ఇంటికి తిరిగి వచ్చే యువ తులు, మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని బస్తీ వాసులు వాపోతున్నారు. అధికారుల వెంటనే స్పందించి బెల్ట్ షాపులై కఠిన చర్యలుతీసుకోవాలని కోరుతున్నారు.

**మిల్క్ బూతులు, కిరాణ షాపుల్లోనే ఎక్కువ....**

కుబ్బుల్లాపూర్‌లో ఎక్కువగా మిల్క్‌బూత్‌లు, కిరాణదుకాణంలో అక్రమంగా మద్యం విక్రయాలు జోరుగా సాగిస్తున్నారని పలువురు స్థానికులు తెలుపుతున్నారు. గుడి,బడి అనే తేడాలేకుండా బ్లాక్ అడ్డాలను ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రత్యేకంగా సిట్టింగ్‌లను సైతం ఏర్పాటుచేకస్తున్నారని తెలుపుతున్నారు. అంతేకాకుండా భగత్‌సింగ్‌నగర్, అంబేద్కర్‌నగర్,గిరినగర్, సుభాష్‌నగర్, షాపూర్ నగర్, చంద్రగిరి నగర్,సూరారం కాలనీలలో వీధి కో బ్లాక్ అడ్డాలను ఏర్పాటు చేసి అక్రమంగా మద్యం ను విక్రయిస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడని ఆయా కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం

- రాష్ట్ర ముదిరాజ్ సంఘం చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్





బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌లో జరిగిన వార్డు సభలో ప్రసంగిస్తున్న మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్.

నార్సింగి, జనవరి 22 ప్రభాతవార్త : అర్హులందరికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని రాష్ట్ర ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పేర్కొన్నారు. బుధవారం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో పీరంచెరువు ప్రభుత్వ పాటశాలలో, బండ్లగూడ శివాజీ యూత్ భవనంలో మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్ అధ్యక్షతన వార్డు సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ శరత్ చంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను చదివి వినిపించారు. అనంతరం జ్ఞానేశ్వర్ ముదిరాజ్, లతాగౌడ్‌లు మాట్లాడుతూ ఆది నుంచి అణగారిన వర్గాలకు అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని పేర్కొన్నారు. గత పదేళ్ల కాలంలో ఒక్కరికి కూడా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వలేదని తెలిపారు. మళ్లీ ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పేదలకు రేషన్‌కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు క్యాతం పద్మావతి, బుర్ర భూపాల్‌గౌడ్, గోకరి శ్రీలత సురేష్‌గౌడ్, బుర్ర సాగర్‌గౌడ్, బొర్ర అనితా వెంకటేష్, బుర్ర మహేందర్‌గౌడ్, తలారి చంద్రశేఖర్, తలారి పద్మావతి పాండు, ఆసియా ఖాజా తదితరులు పాల్గొన్నారు.

**పీరంచెరువులో రసాభాస :** అర్హులకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని బండ్లగూడ కార్పోరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షులు నాగరాజు అధికారులను అడిగారు. దీంతో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులకు, బిఆర్ఎస్ నాయకులకు వాగ్వాదం జరిగింది. కొంత సమయం సభ రాసాభాసగా సాగింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి గొడవ పెద్దది కాకుండా చూశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సర్కారు సర్వేల పేరుతో కాలయాపన చేస్తుందని, అర్హులైన పేదలకు కాకుండా, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఇస్తున్నారని ఆరోపించారు. అర్హులకు న్యాయం చేయాలని అడిగితే కాంగ్రెస్ నాయకులు మా గొంతులను నొక్కేస్తున్నారని, ప్రశ్నించడం కూడా ప్రజాస్వామ్యంలో హక్కు అన్న విషయంను అధికార పార్టీ నాయకులు తెలుసుకోవాలన్నారు. ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420.హామీలు అమలయ్యేలాఅధికార పార్టీ ప్రజా ప్రతినిధులను, అధికారులను ప్రశ్నిస్తూనే ఉంటామని, ప్రజల పక్షాన పోరాటం చేస్తూనే ఉంటామని నాగరాజు స్పష్టం చేశారు.

# ప్రమాదకరంగా కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



ఘాన్సీ బజార్‌లోని మూసాబౌలి,పాత మహిళా పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

చార్మినార్,జనవరి 22 ప్రభాతవార్త : పాతబస్తీ ఘాన్సీ బజార్ డివిజన్ పరిధిలోని మూసాబౌలి,రికాబ్‌గంజ్‌లోని పాత మహిళా పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల చుట్టూ కంచెలు లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.ట్రాన్స్ ఫార్మర్ల చుట్టూ కంచెలను ఏర్పాటు చేయాలని చార్మినార్ విద్యుత్ శాఖ అధికారులకు పలు మార్లు ఘాన్సీ బజార్ డివిజన్ ప్రజలు మొర పెట్టుకున్నప్పటికి ఎటువంటి ఫలితం లేక పోయింది. వస్త్రాలు,బంగారం వ్యాపారాలకు ఎంతగానో ప్రసిద్ధి గాంచిన ఘాన్సీ బజార్‌లో వందలాది వస్త్రాల దుకాణాలతో పాటు బంగారం ఆభరణాల దుకాణాలు ఉన్నాయి.ప్రతీ రోజు వేలాది మంది ప్రజలు ఘాన్సీ బజార్‌లోని మార్కెట్లలో వస్త్రాలు, బంగారు ఆభరణాలు కొనుగోలు చేయటానికి వస్తుంటారు.కాగా మూసాబౌలి,పాత మహిళా పోలీస్ స్టేషన్ సమీపంలో,హైకోర్టు రహదారిలోని పోస్టాఫీస్,బడ్‌కాజాడ్ బాలాజి మందిరం,గాడ్‌గిఫ్ట్ మార్కెట్,మూసాబౌలి హనుమాన్ మందిరం ఎదురుగా ఉన్నవిద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లకు ఎన్నో ఏళ్ల నుంచి కంచెలు లేనందున ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.రహదారులను ఆనుకుని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లుఉండటంతో ప్రక్క నుంచి నడిచి వెళ్లాలంటేనే ప్రజలు భయ పడుతున్నారు.మూసాబౌలి వద్ద రహదారి వెడల్పు చాలా తక్కువగా ఉంది.దీనికి తోడు రహదారిలో వాహానాలు అధిక సంఖ్యలో నడుస్తుంటాయి. రహదారిని ఆనుకుని కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ద్విచక్ర వాహనదారులు తమ వాహానాలను నడుపుతున్న సమయంలో భయాందోళనకు గురివుతున్నారు.వర్షా కాలంలో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ప్రజలు అంధోళన చెందుతున్నారు.హై కోర్టు రహదారిలోకూడ ఇదే పరిస్థితి ఉంది.ట్రాన్స్‌ఫార్మర్ ప్రక్కనే ఉన్న పోస్టాఫీస్‌కు పాతబస్తీలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు వస్తుంటారు.కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వల్ల ప్రజలు ఎన్నో సంవత్సరాలు నుంచి ఇబ్బందుల పాలవుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడని ఘాన్సీ బజార్ వాసులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విద్యుత్ శాఖ అధికారులకు ఘాన్సీ బజార్ డివిజన్‌లోని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్‌లను ఏర్పాటు చేయాలని మొరపెట్టుకున్న పట్టించు కోవటం లేదని వస్త్రాలు,బంగారం వ్యాపారులు తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సౌత్ జోన్ ఎస్ఈ,చార్మినార్ డిఈ వెంటనే స్పందించి ఘాన్సీ బజార్ డివిజన్‌లోని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల చుట్టూ కంచెలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయండి
### - కార్పొరేటర్ సామలహేమ



రేషన్‌కార్డుల సర్వే విధానాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సామలహేమ

**సికింద్రాబాద్, జనవరి 22 ప్రభాతవార్త:** నామాలగుండులోని వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ డిప్యూటీ కమిషనర్‌తో సమావేశం అయ్యారు డివిజన్ పరిధిలోని జరుగుతున్న అభివృద్ధి పనులు మరియు పెండింగ్‌లో ఉన్న పనులు గురించి చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు, ఇందిరమ్మ ఇండ్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అర్హులకు రేషన్ కార్డులు అందేలా సక్రమంగా సర్వే జరపాలని అధికారులను సూచించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్‌తో కలసి సర్వే సరళిని పరిశీలించారు. దళారులకు నమ్మి ఎవరు మోసపోవద్దు అని ప్రజలకు పిలుపునిచ్చారు. దళారులకు ఎవరు డబ్బు ఇవ్వకూడదు అని సూచించారు అర్హులైనవారికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సుభాష్, వార్డు కార్యాలయ ఇన్చార్జి సంధ్య రాణి, జిహెచ్ఎంసి, ఏ ఈ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లవాగు శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు

**చార్మినార్, జనవరి 22 ప్రభాతవార్త :** పాతబస్తీ కందికల్ గేట్ నల్లవాగు శ్మశాన వాటికలో 13 లక్షల 50 వేల రూపాయలతో చేపట్టిన డ్రైనేజీ పైప్ లైన్ పనులు, ఫెన్సింగ్ ఇతర డెవలప్ మెంట్ పనులకు బుధవారం జిహెచ్ఎంసి కాంగ్రెస్ ఓబిసి సెల్ ఉపాధ్యక్షులు శ్యాంరావు ముదిరాజ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్. మధు, దేవేందర్, రాజు, కిడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. జిహెచ్ఎంసి నిధులు మంజూరు చేసిందని శ్యాంరావు ముదిరాజ్ తెలిపారు.

## తెలుగు విశ్వవిద్యాలయంలో నిన్నే పెళ్ళాడతా

**రవీంద్రభారతి, జనవరి 22 ప్రభాతవార్త :** ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసరంజని, సరసిజ థియేటర్ ఫర్ విమెన్ సంయుక్త ఆధ్వర్యంలో నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో రాత్రి 6గంటలకు నిన్నే పెళ్ళాడతా హాస్యనాటిక ప్రదర్శన జరుగుతుందని, నాటిక రచయిత్రి అత్తలూరి విజయలక్ష్మి మీడియాకు తెలిపారు. ప్రస్తుత సమస్త ప్రపంచాన్ని సాంకేతికత శాసిస్తోందని, మున్ముందు మనిషి మేధస్సుతో పనిలేకుండా కృత్రిమ పరిజ్ఞానం ఆర్టిఫిషియల్ ఇంటలెజెన్స్, రోబోలు మనిషినే నడిపించే స్థితి వస్తుందన్న కథాంశంతో ఈ పరిస్థితిని హాస్యరసం మేళవించి వ్రాసిన నాటిక నిన్నే పెళ్ళాడతా అని రచయిత్రి వివరించారు. 23 గురువారం మంజునాథ దర్శకత్వంలో రూపొందిన నాటిక ప్రదర్శన, సభాకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి, గౌరవ అతిథులుగా ఆచార్య డి.ఎస్.ఎన్.మూర్తి, బుర్రా సాయిమాధవ్, దివాకర్‌బాబు, డా. డి.విజయభాస్కర్, డా. మధు చిత్తరువు తదితరులు పాల్గొంటారని విజయలక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా అతిథుల చేతులమీదుగా అత్తలూరి విజయలక్ష్మి మాతృమూర్తి అత్తలూరి అనసూయ స్మారక పురస్కార ప్రదానం జరుగుతుందని, కార్యక్రమాలకు అధికసంఖ్యలో నాటకప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి ఆస్వాదించి విజయవంతం చేయాలని కోరారు.

## 25న హైదరాబాదులో బిసిల విస్తృతస్థాయి సమావేశం
### -బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే శాసనమండలి ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు టికెట్లు కేటాయించాలని, అలాగే బీసీ ఉద్యమ భవిష్యత్ కార్యాచరణ చర్చించి ప్రకటించడానికి ఈనెల 25వ తేదీన హైదరాబాద్‌లోని లక్డికాపూల్‌లోనిఒ హోటల్ అశోకాలో వివిధ బీసీ సంఘాలు, కుల సంఘాలు, బీసీ మేధావులతో రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక వైపు బీసీ కులగనణ చేస్తూనే, ఇంకొక వైపు బీసీలకు టికెట్లు ఇవ్వకుండా రాజకీయ పార్టీలు బీసీలకు అన్యాయం చేస్తున్నాయని బీసీలకు టికెట్లు కేటాయించాలని డిమాండ్ తో పాటు బీసీలకు టికెట్లు కేటాయించని పక్షంలో బీసీలను స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలపడానికి ఈ సమావేశంలో చర్చించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని ఆయన తెలిపారు .ఉదయం 11 గంటల నుండి జరిగే ఈ సమావేశానికి రాజకీయ పార్టీలకతం గా బీసీ నాయకులు, కుల సంఘాల నేతలు, బీసీ విద్యావంతు లు బీసీ పట్టభద్రులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు.

## పేదలందరికీ ప్రభుత్వ పథకాలు : ఆర్డీఓ వెంకట్‌రెడ్డి



ప్రజల నుంచి దరఖాస్తు పత్రంను తీసుకుంటున్న ఆర్డీఓ వెంకట్‌రెడ్డి.

**నార్సింగి, జనవరి 22 ప్రభాతవార్త :**
పేద ప్రజలందరికి ప్రభుత్వ పతకాలు అందేలా చూస్తామని రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి, గండిపేట్, కోకాపేట్, నార్సింగి ప్రభుత్వ పాఠశాలల్లో వార్డు సభలు జరిగాయి. వట్టినాగులపల్లి సభకు ఆర్డీఓ వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని వివరించారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక నిరంతర ప్రక్రియ అని, ఇప్పుడు రాని వారు ఆందోళన చెందవద్దని, మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పేద ప్రజలకు మేలు జరుగాలనే ప్రభుత్వం సంక్షేమ పతకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని, అర్హులంతా దరఖాస్తు చేసుకొని లబ్దిపొందాలని ఆర్డీఓ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ గోపాల విజయ్, కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు కోటిగారి ఉషారాణి, యాదమ్మ, లక్ష్మీ ప్రవ ళిక కిరణ్, శివారెడ్డి, వల్కె విజిత ప్రశాంత్ యాదవ్, గోపాల సునీత గణేష్, ఆదిత్యరెడ్డి, కోఆప్షన్ సభ్యులు ప్రశాంత్‌యాదవ్ పాల్గొన్నారు.

## సంగీత విద్వాంసురాలు డాక్టర్ రమాప్రభకు సత్కారం

**చిక్కడపల్లి, జనవరి 22 ప్రభాతవార్త:** రాగరాగిణి సాహితీ సాంస్కృతిక సేవ సంస్థ ఆధ్వర్యంలో కర్ణాటక సంగీత విద్వాంసురాలు, దుర్గాబాయి దేశముఖ్, ఆంధ్ర మహిళా సభ కాలేజీ అఫ్ ఫైన్ ఆర్ట్స్ చైర్పర్సన్ డాక్టర్ వై.రమాప్రభ బృందంచే త్యాగరాయస్వామి పంచరత్న కీర్తనల గోష్టి గానం ఉంటుందని నిర్వాహక సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి. రమణ కుమారి, ఎం.వి.సుబ్బలక్ష్మి ్మ వివరించారు. ఫిబ్రవరి ఒకటవ తేదీన సంస్థ 18వ వార్షికోత్సవం సందర్బంగా చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాలలితా కళా వేదికలో భీమన్న సాహితి నిధి అధినేత్రి, ప్రముఖ గాయని హైమావతి భీమన్న అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి పలువురు అతిథులు పాల్గొంటారని అన్నారు. ఇదే సభలో డాక్టర్ వై.రమాప్రభ ఆత్మీయ సత్కారం ఉంటుందని అన్నారు.



వార్డు సభల్లో పాల్గొన్న కొలన్ శ్రీనివాస్ రెడ్డి



వార్డు సభ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ ఆవుల పావని జగన్ యాదవ్



ధరఖాస్తులు స్వీకరిస్తున్న వైస్‌చైర్మన్ పద్మారావు



దరఖాస్తులు స్వీకరిస్తున్న సన్న శ్రీశైలం యాదవ్

# కొనసాగుతున్న వార్డు సభలు

**11వ డివిజన్‌లో...**

**నిజాంపేట్, జనవరి 22, ప్రభాతవార్త :** ప్రజా ప్రభుత్వం ప్రజాపాలన వార్డు సభలో 11వ డివిజన్, రాజీవ్ గాంధీ నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్.ఎం.సి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డిలు బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రజా ప్రభుత్వంలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లులు, రేషన్ కార్డులు వస్తాయన్నారు. అందరికీ వచ్చేంతవరకు మళ్లీ మళ్లీ ఇదే ప్రక్రియ జరుగుతూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లీడర్ నగేష్ చారి, 11వ డివిజన్ అధ్యక్షులు ఏలూరి సత్య (నాని), 12వ డివిజన్ అధ్యక్షులు కృష్ణమరాజు, 14వ డివిజన్ అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, పంగా శ్రీనివాస్ రావు, వర్మ రాజు, ఎర్రోళ్ల విష్ణు, సాయిరాజ్, శ్రీనివాస్ గౌడ్, విజయ్ కుమార్, ఫరీద్, షకీల్, అలీ, సురేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

**నిజాంపేట్‌లోన్ 13వ డివిజన్‌లో**

అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ అవుల పావని జగన్ యాదవ్ అన్నారు. బుధవారం నిజాంపేట్‌లోన్ 13వ డివిజన్‌లో కార్పొరేటర్ ఆవుల పావని జగన్ యాదవ్ అధ్యక్షతన ఫేస్ 1లో ప్రజా పాలన అభయ హస్తం పథకాల అమలు వార్డు సభ జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జాబితాను వార్డు ఆఫీసర్ సంధ్య చదివి వినిపించారు. కొత్త దరఖాస్తులు కూడా తీసుకోవడం జరిగింది. కొత్త దరఖాస్తుదారులకు రశీదులను కార్పొరేటర్ ఆవుల పావనిజగన్ యాదవ్ ఎన్ఎంసి సభ్యులు చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గంగాధర్, సాయి, మురళి, సతీష్, స్థానిక డివిజన్ నాయకులు, ఇతర నాయకులు ,డివిజన్ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**దుండిగల్ పురపాలిక సంఘం పరిధిలో..**

**దుండిగల్, జనవరి 22 ప్రభాతవార్త :** ప్రజపాలనలో భాగంగా దుండిగల్ పురపాలిక సంఘం పరిధిలోని 8వ వార్డు నుండి 14వ వార్డు వరకు బుధవారం వార్డు సభలు నిర్వహించారు. ఆయా వార్డులకు సంబంధించిన ధరఖాస్తుల వివరాలను తెలియజేశారు. నూతనంగా ఇందిరమ్మ ఇండ్లకు 1518, రేషన్‌కార్డులకు 1334, రైతుభరోసాకు 17 ధరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా కమీషనర్ సత్యనారాయణరావు మాట్లాడుతూ ఈనెల24 వరకు వార్డు సభలు కొనసాగుతాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ధరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్ ప్రకాశ్ వార్డు సభలను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పద్మారావు, గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, మేనేజర్ లక్ష్మయ్య, ఆర్వో ప్రభాకర్, ఏఈ సురేందర్‌నాయక్, టిపివో సంజున, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

**కొంపల్లి పరిధిలో..**

**కొంపల్లి, జనవరి 22, ప్రభాతవార్త :** మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అదేశాల మేరకు ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా సన్న శ్రీశైలం యాదవ్ ఆధ్యక్షతన వార్డు సభలను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమీషనర్ కె.శ్రీహరి ప్రభుత్వ మార్గదర్శకాలను వార్డు ప్రజలకు వివరించారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా దరఖాస్తు దారుల జాబితాన్ని చదివి వినిపించారు. జాబితాలో లేని వారి నుండి దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. బుధవారం 7,9,11 వార్డులలో ఉదయం 9:00 గంటల నుండి 12:00 గంటల వరకు అలాగే మధ్యాహనం 2:00 గంటల నుండి 05:00 గంటల వరకు 8,10,12వార్డుల యందు వార్డు సభలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ లు యస్ సూర్యకల, ఆదిరెడ్డి రాజిరెడ్డి, ఎ.రజినీ, టి కృష్ణవేణి, డి శిరీష, ప్రజలు, మున్సిపాల్ అధికారులు పాల్గొన్నారు.

## ముగిసిన జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ - 2025
### -84మంది విజేతలకు బహుమతులు ప్రధానం

**గచ్చిబౌలి, జనవరి 22 ప్రభాతవార్త**

గచ్చిబౌలిలోని జిఎంసి బాలయోగి ఇండోర్ స్టేడియంలో ఐదు రోజుల పాటు ఘనంగా కొనసాగిన జెకెఎ ఇండియా ఇన్విటేషనల్ జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్-2025 పోటీలు బుధవారం ముగిశాయి. జపాన్ కరాటే అసోసియేషన్ 50 సంవత్సరాలను పురస్కరించుకొని దేశ, విదేశాలకు చెందిన క్రీడాకారులతో ఐదు రోజుల పాటు పోటీలు నిర్వహించగా, చాంఫియన్‌షిప్‌లో దాదాపు 1200మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 10ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపు క్రీడాకారులు, 18 సంవత్సరాలు పైబడిన క్రీడాకారుల విభాగాల్లో కథ, కుమిథ పోటీల్లో భారత్ నుంచి 36మంది క్రీడాకారులు, విదేశాల నుంచి 48మంది క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. వివిధ విభాగాల్లో మొత్తం 84మంది విజేతలకు ఎంపిక చేసి వారికి బహుమతులు అందజేశారు. 18ఏళ్లు పైబడిన పురుషుల విభాగంలో రష్యాకు చెందిన టిగరన్ రాష్మదీయాన్, మహిళల విభాగంలో ఎక్టరియానా పాల్మాచుక్‌లు విజేతలుగా నిలిచారు. ఇదే విభాగంలో ద్వితియ, త ృతీయ స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు సైతం బహుమతులు అందించారు. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా తెలంగాణ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ సెనే ్స రాపోలు సుదర్శన్, తెలంగాణ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, టెక్నికల్ డైరెక్టర్ సెన్సే దయానంద్ కుమార్‌లు మాట్లాడుతూ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా మొదటి మూడు రోజులు జాతీయ స్థాయి పోటీలు, చివరి రెండు రోజులు అంతర్జాతీయ స్థాయి పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పోటీల్లో భారత్‌తో పాటు న్యూజిలాండ్, అమెరికా, శ్రీలంక, రష్యా, కజకిస్తాన్‌లకు చెందిన కరాటే క్రీడాకారులు పాల్గొన్నారని అన్నారు. భారతదేశంలో అత్యంత ప్రాచుర్యం పొందిన మార్షల్ ఆర్ట్స్‌లో జెకెఎ కరాటే ఒకటని, కరాటే సాధనతో మానసిక, శారీరక ద ృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయన్నారు. స్వీయ రక్షణ టెక్నిక్ కలిగి ఉన్న కరాటే క్రీడపై మహిళలు, అమ్మాయిలు ఎక్కువగా ఆకర్షితులు అవుతున్నారని, తమ అసోసియేషన్‌లోని పలువురు క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని పథకాలు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెకెఎ ప్రతినిధులు, జెకెఎ ఇండియా ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న

## వేదిక ద్వారా విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం

**బేగంబజార్, జనవరి 22 ప్రభాతవార్త:** విద్యుత్ వినియోగదారుల సమస్యలతోపాటు పరిష్కార వేదికను గోషామహల్ ట్రాన్స్‌కో కార్యాలయంలో ఉదయం 10గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహించారు. విద్యుత్ వినియోగదారుల వేదిక సమావేశంలో టెక్నికల్ సభ్యురాలు బి.లలిత, ఫైనాన్స్ సభ్యురాలు కె.శోభరాణి, సభ్యులు జి.గజేందర్‌లు పాల్గొన్ని విద్యుత్‌వినియోగదారుల నుంచి తమ సమస్యలను స్వీకరించారు. బేగంబజార్ డివిజన్ పరిధిలోని ట్రూప్‌బజార్, బేగంబజార్, సీతారాంబాగ్ఎడిఇ పరుధులోని విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. విద్యుత్ సరఫరాలో తరుచుగా అంతరాయాలు, విద్యుత్ హెచ్చుతగ్గుల సమస్యలు, విద్యుత్ మీటర్ సమస్యలు, విద్యుత్ బిల్లులలో సమస్యలు, జాప్యం, పేరుబదిలీ, సేవా కేటగిరి మార్పు, విద్యుత్ సరఫరా పునరుద్దరణ, ట్రాన్స్ ఫార్మర్‌లు, కొత్త విద్యుత్ మీటర్లపై ఆయా ఎఇ పరుధులోని వినియోగదారులు అధికారులకు వివరించారు. మరి కొన్ని సమస్యలను విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాలకు అనుగుణంగా, తగు విచారణ తర్వాత పరిష్కరిస్తామని విద్యుత్ వినియోగదారులకు వివరించారు. సౌత్ సర్కిల్ ఛీఫ్ ఇంజనీర్ సోమిరెడ్డి, ట్రాన్స్‌కో బేగంబజార్ డివిజనల్ ఇంజనీర్ పర్హాత్ అలీ, అసిస్టెంట్ డివిజన్ల ఇంజనీర్లు పి.నాగిరెడ్డి, గణేష్, శ్రీరిష, ఎఇలు ప్రణవీద్, కళ్యాణి, విశాలక్ష్మి ,ప్రభాకర్‌రెడ్డి, కిషోర్, సైదానాయక్, శ్రీనివాస్, దుర్గాప్రసాద్, రిజ్వాన్, పాల్గొన్నారు.



విద్యుత్ వినియోగదారుల సమావేశంలో అధికారులు

## ఫణిభార్గవ్ యాదిలో ఆపన్నులకు ఆర్థికసాయం
### అభినందనీయం : డా. కె.వి.రమణాచారి

**నాంపల్లి, జనవరి 22 ప్రభాతవార్త :** ఉన్నత విద్యావంతుడైన తన కుమారుడు ఫణిభార్గవ్ జ్ఞాపకాన్ని నెమరువేసుకుని స్మరించుకుంటూ తండ్రి సీనియర్ పాత్రికేయుడు ఆర్.వి.రమణ గత తొమ్మిదేళ్లుగా అతని జయంతిని పురస్కరించుకొని పలువురు ఆపన్నులకు ఆర్థిక సహాయంతో అభయహస్తమందించడం అభినందనీయమని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి మీడియాతో అన్నారు. యువ విద్యార్థి నాయకుడు, ఉన్నత విద్యావంతుడు ఆర్.ఫణిభార్గవ్ జయంతిని పురస్కారించుకొని శ్రీత్యాగరాయ గానసభ, కళానిలయం సంయుక్త ఆధ్వర్యంలో 27 సోమవారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో సాయంత్రం 5గంటల నుండి జవహర్ బాలభవన్ పూర్వ సంచాలకుడు డా. ఎం.కె.రాము సభాధ్యక్షతన నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డా. కె.వి.రమణాచారి, ప్రముఖ సంపాదకుడు కె.రామచంద్రమూర్తిలు, సభాప్రారంభకుడుగా గానసభ అధ్యక్షుడు కళా వి.ఎస్.జనార్ధన్‌మూర్తి, విశిష్ట అతిథిగా సీనియర్ సంపాదకుడు బైస దేవదాసు తదితరులు పాల్గొని పాత్రికేయులు గంధం నవీన్, పి.రాధిక, పి.జ్యోతిలకు నగదు పురస్కారం; విద్యార్థి టి.క్రాంతి, అమృత శ్రీవర్షిణి సేవాసంస్థలకు ఆర్థిక సహకారం; సీనియర్ సంపాదకుడు, సుందరయ్య విజ్ఞానకేంద్రం మేనేజింగ్ కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్‌కు ఆత్మీయసత్కారం కావించనున్నట్లు ఆర్.వి.రమణ, సంస్థ అధ్యక్షుడు ఎ.సురేందర్‌లు తెలిపారు. సభకుముందు నాట్యగురువులు రాధిక, తులసిల శిష్యబృందాలచే నృత్యప్రదర్శనలు, కొండలరావు బృందం, మంజులచే గీతాలాపన ఉంటాయని వారు పేర్కొన్నారు.

## నేషనల్ ఐస్ కర్లింగ్ పోటీల్లో తెలంగాణాకు రజత పథకాలు






పథకాలు సాధించిన విజేతలు

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:**
ఈనెల 17 నుంచి 21 వరకు గుల్బార్గా కాశ్మీర్‌లో జరిగిన 4వ నేషనల్ ఐస్ కర్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో తెలంగాణ నుండి సీనియర్ ఉమెన్స్ టీంలో పాల్గొన్న లయన్ వి.వసంత మాధురి, ఎం.నాగ అక్షయ, కునదొడ్డి స్టెల్లా దీపిక, కునాదొడ్డి రచ్చేల్ రజత పతకాలు కైవసం చేసుకున్నారని కర్లింగ్ అసోసియేషన్ అఫ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి వి.వసంత మాధురి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ నుండి బుర్ర మల్లికార్జున పవన్ కుమార్, జి.కృష్ణ మూర్తి, నీలా సాయి సోహాన్ లతో పాటు ఆంధ్రప్రదేశ్, జమ్ముకాశ్మీర్, కర్ణాటక, తమిళనాడు, లడక్, అరుణాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, హర్యానా, పంజాబ్ మొత్తం 18 రాష్ట్రల నుండి 300 లకు పైగా పోటీదారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్లింగ్ ఫెడరేషన్ అఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ డ్యానిష్, మొహమ్మద్ అర్షద్ పాల్గొన్నారు.

## బస్తీలో 'సంవిధాన్ గౌరవ అభ్యాన్" కార్యక్రమం

**చిక్కడపల్లి, జనవరి 22 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్ లోని పలు బస్తీల్లో బుధవారం "సంవిధాన్ గౌరవ అభ్యాన్" కార్యక్రమంలోని భాగంగా బుధవారం భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు నివాళులర్పించి, ప్రియతమ భారత ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో బిజెపి రాజ్యాంగాన్ని గౌరవించే విధానాన్ని తెలియజేస్తూ డివిజన్ పరిధిలోని వివిగిరినగర్ బస్తి, వాల్మీకి నగర్ బస్తీల్లో సమావేశాలు నిర్వహించింది. డివిజన్ అధ్యక్షుడు వి. నవీన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బిజెపి సికింద్రాబాద్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. బిజెపి హయాంలో "370 ఆర్టికల్" అమలు చేయడం, "త్రిపుల్ తలాక్" తొలగించడము ఎంతో గర్వించదగ్గ ప్రతిష్టాత్మక నిర్ణయాలన్నారు. నేడు 'రాహుల్ గాంధీ గారు"భారతదేశం నీళ్ల తాగుతు భారతదేశంలో ఉంటూ భారతదేశంతో పోరాటం చేస్తాననడం ఎంతవరకు సమంజసం అని అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రత్నసాయి చందు, నేతలు శ్రీకాంత్, దామోదర్, సురేష్, ఆకుల సురేందర్, శ్రీనివాస్, సాయి కుమార్, యాదగిరి, సతేందర్, సాయి కృష్ణ, నీరజ్, ధీరజ్, ప్రకాష్, బస్తీ వాసులు నిర్మల, లావణ్య, రేణుక, ప్రేమలత, శ్రీలత, అనురాధ, రాములమ్మ ,మసుమ్మర్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నేతలు

## మున్సిపల్ కమిషనర్‌ని కలిసిన బంజారా సేవా సంఘం నాయకులు



మున్సిపల్ కమిషనర్‌కి లెటర్‌ను అందజేస్తున్న బంజారా సేవా సంఘం కమిటీ సభ్యులు

**నిజాంపేట్, జనవరి 22, ప్రభాతవార్త**

బాచుపల్లి మండలం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బంజారా సేవా సంఘం కమిటీ ఆధ్వర్యంలో బంజారా కమ్యూనిటీ హాల్ కోసం మంచినీటి సౌకర్యం లేక గత మూడు నాలుగు సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్నటువంటి తరుణంలో గత వారం పది రోజులుగా బంజారా నాయకులు శివమాల చేసుకొని దాదాపుగా 70 మంది కమ్యూనిటీ హాల్ దగ్గర సన్నిధానంలో నివాసం ఉంటున్నారు. మంచినీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బంది పాలవుతున్న విషయాన్ని గుర్తించి వెంటనే కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కోలన్ హనుమంత రెడ్డిని కలిసి సమస్య గురించి చర్చించి బోర వేయించాలని కోరడం జరిగింది. వెంటనే కోలన్ హనుమంత్ రెడ్డి స్పందించి మున్సిపల్ కమిషనర్ లెటర్ రాయడం జరిగింది. ఆ లెటర్‌ను బుధవారం మున్సిపల్ కమిషనర్‌కి లెటర్‌ను బంజారా సేవా సంఘం కమిటీ ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. కమిషనర్ వెంటనే స్పందించి వీలైనంత త్వరలో బోర్ వెల్ మంజూరు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బంజారా సేవా సంఘం కమిటీ ప్రధాన కార్యదర్శిలు రామచంద్రనాయక్, అధ్యక్షులు రాములు నాయక్, హర్యా నాయక్, సంఘం ప్రచార కార్యదర్శి డాక్టర్ ఎస్పీ నాయక్, రవి నాయక్ శివ నాయక్, సోమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 25న "తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల మహాసభ "
### -రాష్ట్ర అధ్యక్షులు జీసి రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:**
ఈనెల 25న లక్డికాపూల్ రెడ్‌హిల్స్‌లోని ఫ్యాప్సీ భవన్‌లో తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల మహాసభ నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బిసిరెడ్డి తెలిపారు. ఈమేరకు బుధవారం మింట్ కాంపౌండ్ ఆవరణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శనివారం నాడు జరగబోయే రాష్ట్ర వార్షికోత్సవ సందర్భంగా నూతన క్యాలెండర్ డైరీ ని ఆవిష్కరింపబడుతుందని జీ సి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు. ప్రభుత్వ సలహాదారుడు. కే.కేశవరావు, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, విద్యుత్తు ప్రధాన తనిఖీ సిహెచ్ రామాంజనేయులు. మాస్టర్ ప్లాన్ సిజిఎం. చక్రపాణి, తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డ్ కార్యదర్శి. టీ కాంతారావు గారు. కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు మరియు తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు మెంబర్ నక్క యాదగిరి. ప్రధాన కార్యదర్శి ఏం శ్రీనివాస్ గౌడ్. ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు సభ్యుడు నేమాల బెనర్జీ. రాష్ట్ర సలాదారుడు. రాజు మహారాజ్. ఏ. మహేందర్. నామిని వెంకటేష్ నేత. పాల్గొన్నారు.

### ఉచితంగా చికిత్స చేయిస్తాం : డియర్ కృష్ణ మూవీ టీం

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:**
క్రోనిక్ కన్స్ట్రక్టీవ్ పెరికార్డిటీస్ వ్యాదితో బాధపడే వ్యక్తి జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిన డియర్ కృష్ణ చిత్రానికి వచ్చే ఆదాయంతో ఆ వ్యాదిగ్రస్తులకు ఉచితంగా చికిత్స చేయించనున్నట్లు ఆ చిత్ర నిర్మాత బలరాం తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో అక్షయ్ కృష్ణ, నటుడు లోహిత్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ నందు తో కలిసి మాట్లాడారు. ఈ చిత్రం పూర్తిగా యధార్ధ సంఘటన ఆధారంగా రూపొందించిందని హీరో అక్షయ్ అదే వ్యాధితో చావు వరకు వెళ్లి మళ్ళీ తిరిగి దేవుడి దయతో ఎలా బ్రతికాడో చిత్రంలో చూడొచ్చన్నారు. ఈ చిత్రం ద్వారా వచ్చే ఆదాయంతో ఆ వ్యాధిగ్రస్తులకు ఒకరికి ఉచితంగా చికిత్స చేయించనున్నట్లు ఆయన తెలిపారు.

## శివాలయం కోనేరులో గుర్తు తెలియని బాలుడు గల్లంతు..

**జగద్గిరిగుట్ట, జనవరి 22, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధి మహాదేవపురంలోని గుట్ట మీద ఉన్న శివాలయం కోనేరులో గుర్తు తెలియని బాలుడు గల్లంతయ్యాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న జగద్గిరిగుట్ట పోలీసులు డిఆర్ఎఫ్ బృందం సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. గత 24గంటల నుండి గాలింపు చెప్పట్టిన బాలుడి ఆచూకీ లభించలేదు. బాలుడు ఎవరు ఎక్కడ వ్యక్తి అనేది కూడా ఇంకా తెలియలేదు. ఎటువంటి పిర్యాదు రాకపోవటంతో పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ధర్యప్తు చేపడుతున్నారు. సీసీ కెమెరాల్లో ముగ్గురు చిన్నారులు కోనేరు వైపు నడుచుకుంటూ వెళ్లిన దృశ్యాలు ఉండటంతో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

## అవగాహన లోపంతోనే ఏకశిలా నగర్ ఘటన
### -పూర్తి వివరాలను ఎంపి ఈటలకు అందజేస్తాం..

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:**
మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఘట్కేసర్ మండల్ కుర్రముల గ్రామం ఏకశిలనగర్ లో జరిగిన దాడి పూర్తిగా అవగాహన లోపంతోనే జరిగిందని బాధితులు ఆలూరి వెంకటేష్, విజయ్ భాస్కర్ లు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొర్రముల గ్రామం సర్వే నెంబర్ 739 నుండి 742 వరకు 4725 గుంటల భూమిని 2007లో కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఇక్కడ రెండు వేల ప్లాట్లు అని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం ఈ విషయంలో ఎంపి ఈటెలను స్థానిక రియల్ బ్రోకర్లు తప్పుదోవ పట్టించారని అన్నారు. తమ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించడమే కాక పేద మధ్యతరగతి ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి ఆ ప్రాంతంలో ఉద్రిక్తత పరిస్థితులు తీసుకువచ్చారని అన్నారు. తప్పుడు సమాచారంతో స్థానిక ప్రజాప్రతినిధిని అక్కడికి ఆహ్వానించడంతో ఆయనను చూసుకొని రియల్ బ్రోకర్లు చెలరేగిపోయారని అన్నారు.

## బోర్ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



బోర్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:**
నూతన బోర్‌వెల్ పనులను అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. బుధవారం నల్లకుంటలోని నరేందర్‌నగర్ పార్కులో స్థానిక కార్పోరేటర్ వై.అమృతతో కలసి ఆయన లాంఛనంగా పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బోర్ వేయటంతో పార్కులో నెలకొన్న నీటి సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉస్మానియా ఆసుపత్రికి మరమ్మతులు చేయాలి
### -టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా

**ముషీరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** శిధిలావస్థలో ఉన్న ఉస్మానియా ఆసుపత్రి భవనానికి తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. బుధవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి అధ్వాన్నంగా తయారయిందని ఆరోపించారు. చిన్నపిల్లల కోసం కేవలం నిలోఫర్ మాత్రమే ఉందని, అక్కడ పరిస్థితులు హృదయవిదారకంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు పాలనలో ప్రపంచ ఆరోగ్య రాజధానిగా వెలుగొందిన హైదరాబాద్ నేడు అవినీతికి రాజధానిగా మారిందని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రజారోగ్యంపై దృష్టి పెట్టాలని, ఆసుపత్రులలో సమస్యలు పరిష్కరించాలని, ఖాళీలు భర్తీచేసి, డాక్టర్ల కొరత నివారించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

## వరకట్నహత్య కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

**అత్తాపూర్ జనవరి 22, ప్రభాతవార్త :**
వర కట్నపు హత్య కేసులో నిందితుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు విలువరించినట్లు అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు... 09.06.2018 నాడు అప్పటి రాజేంద్రనగర్ పిఎస్ (ప్రస్తుత అత్తాపూర్ పిఎస్) పరిధిలోని ఖయ్యూమ్ నగర్ చింతల్ మెట్ ఏరియాలో ఓ వివాహితను వరకట్నం కోసం వేధించి ఆమె మరణానికి కారణమైన కేసులో పూర్తిస్థాయిలో విచారణ జరిపిన ఎల్బీనగర్ కోర్టు 11వ అడిషనల్ న్యాయమూర్తి జయ ప్రసాద్ నిందితుడు ప్రైవేటు ఎంప్లాయ్ అయిన ఖయ్యుం నగర్ కు చెందిన మొహ్మద్ అసద్ అలీకి ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు 3000 వేల రూపాయల జరిమానా విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రవి కుమార్, పరిశోధన అధికారిగా ఏసీపీ అశోక్ వ్యవహరించారు.

### దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితుల రిమాండ్



**కంటోన్మెంట్, జనవరి 22 ప్రభాతవార్త:** ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడే ఇద్దరు పాత నేరస్తులను నిందితులను పల్లి పోలీసులు అరెస్ట్ చేసి వారివద్ద నుండి రూ. 4లక్షల 60వేల విలవచేసే వెండి ఆభరణాలు, 2 టైటాన్ వాచిలు, 1 ప్రోవోక్ వాచి, రెండుమొబైల్ ఫోన్‌లు, రెండు కెనాన్ కెమెరాలు, లెన్స్‌లు, హోండా ఆక్టివా ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాపూర్‌నగర్‌కు చెందిన వృత్తిరిత్యా డ్రైవర్ అయిన నాగపల్లి కిషోర్‌కుమార్ (21), ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన వృత్తిరిత్యా లేబర్ ఆయిన చితారి భరత్ (21)లు పాత నేరస్తులు. వీరిపై గతంలో అల్వాల్, బోయిన్‌పల్లి, బేగంపేట పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో చైన్‌స్నాచింగ్‌తో పాటు పలు నేరాలకు సంబంధించిన కేసులలో నిందితులు. సంక్రాంతి పండుగ సమయంలో ఎవరూ లేని నివాసాల ఇళ్ల తాళాలు పగులగొట్టి దొంగతాలను పాల్పడ్డారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు 150 కంటే ఎక్కువ సీసీ కెమెరాలను పరిశీలించి గట్టి ప్రయత్నాలు చేయడం ద్వారా నిందితులను అదుపులోకి తీసుకోగలిగారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్



రసూల్‌పురాలో కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్,జనవరి 22 ప్రభాతవార్త:** పేద ప్రజల సంక్షేమం కోసం సిఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందాలని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. నయోజకవర్గంలోని 85 మందికి మంజూరైన కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను బుధవారం 2వ వార్డులోని గన్ బజార్ కమ్యూనిటీ హాల్‌లో ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు. పేదలందరికి కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ తహశీల్దార్ పాండు నాయక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్యామ్‌సన్ రాజు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు



విద్యార్థులను మోటివేషన్ చేస్తున్న గురు చరణ్

**జీడిమెట్ల, జనవరి 22, ప్రభాతవార్త**

టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అకాడమిక్ డైరెక్టర్ డా. సుర రవి చంద్రారెడ్డి ఆదేశాల మేరకు 10వ తరగతి విద్యార్థులకు మార్కులు ఎలా సాధించాలి అన్న అంశంపై శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా బుధవారం స్ట్రెస్‌లెస్ స్కోర్ మోర్ అన్నా అంశంపై గురు చరణ్ మానసిక దృఢ విశ్వాసాన్ని పెంపొందించే విధంగా వారి ఉపన్యాసం ద్వారా చైతన్యపరిచారు. రాబోయే తరంలో విద్యా విధానాన్ని వివరిస్తూ మానవ విలువలు క్రమశిక్షణతో చేసే ఏ పనైనా దృఢంగా విశ్వసనీయంగా ఎదుటివారి మనసును గెలిచే విధంగా తయారవడానికి దోహదపడతాయని వారి ఉపన్యాసంలో వివరించారు. టీవీఆర్ విద్యాసంస్థల విద్యార్థుల కొరకు ప్రత్యేకతలకు ఆహ్వానించిన యాజమాన్యానికి గురు చరణ్ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పాఠశాల యాజమాన్యం వారిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. వాకే క్చాతుర్యం ద్వారా విద్యార్థులలో మానసిక ధైర్యాన్ని నింపిన గురు చరణ్‌ని టీవీఆర్ విద్యా సంస్థల చైర్మన్ కె. కోటి రెడ్డి అభినందించారు

## పేదల పెన్నిధి సిఎం సహాయనిధి : డిప్యూటీ మేయర్

**నిజాంపేట్, జనవరి 22, ప్రభాతవార్త**

నిరుపేదల పెన్నిధి సీఎం సహాయ నిధి అని డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ అన్నారు. బుధవారం నిజాంపేట్ లోని డిప్యూటీ మేయర్ కార్యాలయంలో ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మంజూరు చేయించిన రూ.45,000 విలువగల సీఎం సహాయనిధిని లబ్ధిదారుడు మొహమ్మద్ నయుముద్దీన్‌కు డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు రాఘవేంద్ర రావు, బాలాజీ నాయక్, బొర్రా దేవి ముదిరాజ్, 8వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మేకల మధుసూదన్, నాయకులు కొండయ్య చౌదరి చేతుల మీదుగా చెక్కును పంపిణీ చేశారు.

## అభివృద్ధి పనులు ప్రారంభించిన చైర్‌పర్సన్ క్రిష్ణవేణిక్రిష్ణ



కాలనీవాసులతో చైర్‌పర్సన్ క్రిష్ణవేణి క్రిష్ణ

**దుండిగల్, జనవరి 22 ప్రభాతవార్త:** దుండిగల్ పురపాలిక సంఘం పరిధి 9వ వార్డులోని సురక్షమెడోస్‌లో రూ,10లక్షలు, మాధవరావునగర్‌లో రూ,5లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న సిసిరోడ్డు నిర్మాణ పనులను చైర్‌పర్సన్ క్రిష్ణవేణిక్రిష్ణ ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గుత్తేదారులను ఆదేశించారు. అదే విధంగా గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో పురపాలిక పరిధిలోని ఆయా వార్డుల్లో అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రధానంగా మౌళికవసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తూ సిసిరోడ్లు, భూగర్భడ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి పైపులైన్లు, వీధి ధీపాల ఏర్పాటు, కమ్యూనిటీహాల్స్ నిర్మాణం తదితర అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ప్రజల ఆశీస్సులతో ప్రజాసేవ కోసం నిత్యం అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, మహేందర్‌యాదవ్, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ రవీందర్‌యాదవ్, బిఆర్ఎస్ వైస్‌ప్రెసిడెంట్ రంగయ్య, జనరల్ సెక్రటరీ మల్లేష్ తదితర నాయకులతో పాటు ఆయా కాలనీవాసులు పాల్గొన్నారు.

## మురుగునీరు సాఫీగా పోయేందుకు రోబోటిక్ జెట్టింగ్ మిషన్



రోబోట్ మిషన్‌ను ప్రారంభిస్తున్న కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు నంజున్ దీశ్వర్, సిఈఓ మధుకర్ నాయక్, బోర్డు మెంబర్ రామక్రిష్ణ తదితరులు

**కంటోన్మెంట్,జనవరి 22 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో డ్రైనేజీ, మురుగునీరు సాఫీగా పోయేందుకు రూ.60 లక్షల వ్యయంతో రోబోట్ జెట్టింగ్ మిషన్‌ను ఏరా ్పటు చేయడం జరిగిందని కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ ఎన్.వి. నంజున్ దీశ్వర్ తెలిపారు. డ్రైనేజీ మ్యాన్ హోల్ ్సలలో పేరుకుపోయిన చెత్తా,చెదారం, రాళ్లురప్పలు ఉండడంతో డ్రైనేజీ మురుగునీరు సాఫీగా పోలేక బస్తీలలో డ్రైనేజీ మురుగునీరు బస్తీలలో ఏరులై పారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా రోబోట్ జెట్ట్ంగ్ మిషన్‌ను బుధవారం బ్రిగేడియర్, సిఈఓ మధుకర్ నాయక్, నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణలతో కలిసి ప్రారంభించారు.కార్యక్రమంలో హెల్త్, శానిటేషన్ సూరిండెం ట్‌లు ఎం.దేవేందర్,ఏ.మహేందర్, రాజుకుమార్, పవన్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**యాకుత్‌పుర,జనవరి 22 ప్రభాతవార్త :** విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 23వ తేదీ గురువారం ఉదయం 11.30 గంటలు నుంచి సాయంత్రం 4 గంటలు వరకు నందిము స్లాయి గూడ, ఎస్‌పి నగర్,మారుతీనగర్,అత్తాపూర్,రాంబాగ్, తేజస్వీనగర్, హేడాకాలనీ,శివాజీనగర్,చాక్‌చావనీ,పాండురంగా నగర్,సిబిఐటి కాలనీ,సిసిఎండి,సోమిరెడ్డి నగర్,వీకర్ సెక్షన్ కాలనీ,కొండారెడ్డి నగర్,బహదూర్‌పుర ప్రాంతాలలో,దేవిబాగ్ ఫీడర్ పరిధిలో 10 నుంచి 12 గంటలు వరకు ఈద్గా,శివాలయం.సిద్ధిఖ్ గుల్షన్ ఫీడర్ పరిధిలో సాయంత్రం 3 నుంచి 5 గంటలు వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు చార్మినార్ సిబిడి అధికారులు తెలిపారు.

## ఫుట్‌పాత్ వ్యాపారులపై అధికారులు మానవత దృక్పదంతో వ్యవహరించాలి : ఎమ్మెల్యే తలసాని



జిహెచ్ఎంసి, ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**కంటోన్మెంట్,జనవరి 22 ప్రభాతవార్త:** ఫుట్‌పాత్ చిరు వ్యాపారుల పట్ల ప్రభుత్వం ,అధికారులు మానవత దృక్పదంతో వ్యవహరించాలని, మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సనత్ నగర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వందలాది మంది ఫుట్‌పాత్ వ్యాపారులు, హాకర్స్,తోపుడు బండ్ల వ్యాపారులు పొట్ట కూటి కోసం జీవనం సాగిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. బుధవారం మారేడ్‌పల్లిలోని జిహెచ్ఎంసి జోనల్ కార్యాలయంలో ట్రాఫిక్, జిహెచ్ఎంసి వివిధ విభాగాల అధికారులతో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ ఫుట్ పాత్‌లపై వ్యాపారాలు తొలగిస్తే వారి కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. పేదల జీవనోపాధిని దెబ్బతియకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ రవికిరణ్, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, టౌన్‌ప్లానింగ్ డిసిపి సుష్మిత, ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు, ట్రాఫిక్ సిఐలు వెంకట్ రాములు, బిఆర్ఎస్ నాయకులు అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, నాగులు, కిషోర్, మహేశ్ యాదవ్, ఆరీఫ్ పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ అభివృద్ధికి కేంద్రం నుండి నిధులు తెస్తా : రామక్రిష్ణ



6వ వార్డు ఇఫ్రిశాట్ కాలనీలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న బోర్డు మెంబర్ రామక్రిష్ణ తదితరులు

**కంటోన్మెంట్,జనవరి 22 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం నుంచి మరిన్ని నిధులు తెచ్చి సమస్యలు పరిష్కరిస్తామని నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ తెలిపారు. బుధవారం 6వ వార్డులోని ఇఫ్రిశాట్ కాలనీలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్.కె. మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు ప్రతీక్ జైన్, అజయ్ గౌడ్,రవిందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్లు రోడ్డు భద్రతా సూత్రాలు పాటించాలి

**కంటోన్మెంట్,జనవరి 22 ప్రభాతవార్త:** ప్రమాదాల నివారణకు డ్రైవర్లు, రోడ్డు భద్రతా సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత ్సవాలు 2025లో భాగంగా బుధవారం తిరుమలగిరిలోని సికింద్రాబాద్ రీజినల్ ట్రాన్ ్సపోర్ట్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ భవిష్యత్తును కాపాడుకోవాలన్నారు. ర్యాస్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, మద్యం సేవించి డ్రైవ్ చేస్తూ ప్రాణాలు పోగొట్టుకుంటారని సూచించారు. అందు వల్ల ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జాయింట్ కమిషనర్ సి.రమేష్, ఐటీ, విజిలెన్ ్సవిభాగం జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్, సికింద్రాబాద్ ఆర్టీఓ ఎర్రి స్వామి, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్ట ర్లు జయచందర్, ఎస్.నేహా, అవినాస్ నాయక్, లావణ్య, ఏటలు వాని, యాదమ్మలతో పాటు కానిస్టేబుళ్లు, హోం గార్డులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

## రామ ప్రతిష్టాపన దినోత్సవం హిందువులకు పండుగరోజు



బాలరాముని చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న న్యాయవాదులు

**ముషీరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:**

అయోధ్యలో బాలరాముని విగ్రహం ప్రతిష్టించిన రోజు జనవరి 22 హిందువులకు పండుగరోజని బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొండల్‌రెడ్డి, తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం శ్రీబాలరాముని విగ్రహ ప్రతిష్ట జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా హిందూ న్యాయవాదుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోట్లాది హిందువుల కల నిజమైన రోజైన జనవరి 22 చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫుడ్‌కమీషన్ సభ్యులు కొంతం గోవర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు పీతం ప్రదీప్, నరేష్, గుర్వయ్య, బాల్‌రెడ్డి, నగేష్, విజయ్, మంత్రి రవీందర్, రాంనర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ ఎడ్ల జంగయ్య 17వ వర్ధంతి



స్వర్గీయ ఎడ్ల జంగయ్య విగ్రహానికి రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్,ఆలయ కమిటీ ప్రతినిధులు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**చార్మినార్,జనవరి 25 ప్రభాతవార్త :**

పాతబస్తీ హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహంకాళీ ఆలయం కమిటి మాజీ కోశాధికారి స్వర్గీయ ఎడ్ల జంగయ్య 17వ వర్ధంతి కార్యక్రమం బుధవారం జరిగింది.రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్,జాతీయ ఎస్.సి.కమిషన్ సభ్యులు కె.రాములుతో పాటు పలువురు స్వర్గీయ ఎడ్ల జంగయ్య విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షులు జగన్మోహన్ కపూర్,కార్యదర్శి కె.దత్తాత్రేయ,కోశాధికారి ఏ.సతీష్ కుమార్,ప్రతినిధులు రాందేవ్ అగర్వాల్,ఎం.కృష్ణ, డి.ఆర్. ప్రభాకర్,ఎం.వినోద్,టి.రమేష్ బాబు,ఎం.విజయ్ కుమార్, జి,రాజు,రామ్‌సింగ్,కన్నయ్యలాల్,అశోక్ రెడ్డి,ముకేష్ యాదవ్,రవీందర్ చారి,సాయినాధ్,సాయి కిరణ్, పవార్,పి.మహేష్,పవన్,అంకిత్ జైస్వాల్, బిజెపి నాయకులు చేతన్ సూరి, ఎం.కుమార్,,ప్రవీణ్,విజయ్ పాల్గొన్నారు.

## ఎకెఆర్ పెట్రోల్ పంప్,అండ్ బార్ యజమానులు అరెస్ట్

**హైదరాబాద్ జనవరి22,ప్రభాతావర్త :** నకిలీ పత్రాలు సృష్టించి కోట్ల రూపాయలు విలువ చేసే స్థలాన్ని కాజేయాలని యత్నించిన ఇద్దరు నిందితులైన ఏకెఆర్ బార్ అండ్ పెట్రోల్ పంపు యజనులు కిషోర్ కుమార్ అశోక్ కుమార్‌లను మైలార్దేవపల్లి పోలీసులు అరెస్టు చేశారు. బేగంబజార్‌కు చెందిన జి.ఓంప్రకాష్ అనే వ్యక్తికి సంబంధించి రాజేంద్రనగర్ మండలం బుద్వేల్ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 265, 168 పార్ట్ లో గల 235 గజాల ఓపెన్ ప్లాట్ ఉంది.గగన్ పహాడ్ ప్రాంతానికి చెందిన ఏకెఆర్ పెట్రోల్ పంప్, ఏకెఆర్ బార్ యజమానులు కిషోర్ కుమార్ అశోక్ కుమార్, ఇద్దరు సోదరులు 102 గజాల స్థలంలో ఫోర్జరీ చేసి సంతకాలు చేసి ఒక ఫేక్ పత్రాలను సృష్టించారు.అనంతరం రాజేంద్ర నగర్ లోని 2వ జూనియర్ సివిల్ కోర్టులో తప్పుడు కేసు వేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఫోర్జరీ చేసి స్థలాన్ని కాజేయాలని చూస్తున్నారని గుర్తించి బుధవారం కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించారు.

## ప్రతి విద్యార్థి నేర్చుకోవలసిన గొప్ప కళ ఎన్‌సిసి



ఎన్‌సిసి కెడెట్లను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, జనవరి 22 ప్రభాతవార్త:** విద్యార్థి దశలో ఎన్‌సీసీలో చేరి దేశానికి చేయాలనేది ఒక గొప్ప అవకాశమని, అది ప్రతి విద్యార్థి నేర్చుకోవలసిన ఉత్తమమైన కళ అని అలాంటి సదవకాశాన్ని విద్యార్థులు తప్పకుండా ఉపయోగించుకోవాలని డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ కళాశాల యాజమాన్య సభ్యులు సూచించారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని అంబేద్కర్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ఎన్‌సీసీ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే ఎన్‌సీసీ విద్యార్థులకు ర్యాంకింగ్ ప్రమోషన్స్, అనంతరం ఎన్‌సీసీ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎన్‌సీసీ కెడెట్ల ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మేనేజ్ మెంట్ మెంబర్, ప్రిన్సిపాల్, డైరెక్టర్ కలిసి విద్యార్థులకు ర్యాంకింగ్ ప్రమోషన్స్‌ని అందజేసి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. దేశానికి సేవ చేసే లక్షణాలు అలవాడుతాయన్నారు. ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులకు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలతోపాటు మంచి వ్యక్తిత్వ వికాసాన్ని అలవర్చుకోగలరాన్నారు. అంబేద్కర్ కళాశాల ఎన్‌సీసీ విభాగం పని తీరును వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్ట శేఖర్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ విష్ణుప్రియ ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ యం. కిరణ్ కుమార్, అధ్యాపకులు విద్యార్థులు, పాల్గొన్నారు

## ప్రపంచం మెచ్చిన తెలుగు చిత్రకారుడు దామెర్ల రామారావు



ప్రసంగిస్తున్న శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్ లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్

**చిక్కడపల్లి, జనవరి 22 ప్రభాతవార్త:**

బ్రిటిషర్ల మైండ్ బ్లాక్ చేసిన తెలుగు చిత్రకారుడు దామెర్ల రామారావు ప్రసిద్ధ చిత్రకారుడు దామెర్ల రామారావు అని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్ లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. 28 ఏళ్ల వయసులో మరణించినా కూడా తన పెయింటింగ్స్‌తో చిరంజీవిగా నిలిచిపోయారని అన్నారు. చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికలో ఎందరో మహానుభావులు మధుర స్మృతులలో భాగంగా ప్రసిద్ధ చిత్రకారుడు దామెర్ల రామారావు సంస్మరణ సభ గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావీఎస్ జనార్ధన్ మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో సంగీత విద్వాంసురాలు మల్లాది ఉష, గాయకుడు కాందూరి శివకుమార్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## త్రినాథరావుకు 'గానసుధా సాగర' బిరుదు ప్రదానం



అంతర్జాతీయ గాయకుడు త్రినాథరావుకు 'గానసుధా సాగర' బిరుదును అందించిన దృశ్యం

**చిక్కడపల్లి, జనవరి 22 ప్రభాతవార్త:** అంతర్జాతీయ గాయకుడు, స్వరకిన్నెర చింతలపూడి త్రినాథరావుకు 'గానసుధా సాగర' బిరుదును అందించి గౌరవించింది. మంగళవారం చత్తీజ్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్ నగరంలో ఆంధ్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగీత రంగానికి త్రినాథరావు చేసిన ఎనలేని సేవలకుగాను ఆయనకు గౌరవాన్ని అందించింది. నిర్వాహక సంస్థ అధ్యక్షుబు జి.స్వామి మాట్లాడుతూ ఘంటసాల శతజయంతి సందర్భంగా సంవత్సరంలో 365 రోజులు రోజుకో ఘంటసాల పాట చొప్పున 365 రోజులు పాటలు పాడి రికార్డు నెలకొల్పిన త్రినాథరావును సంస్థ స్వర్ణోత్స వాల సందర్భంగా సత్కరించడం జరిగిందన్నారు. త్రినాథరావుమాట్లాడుతూ తెలుగువారు నివసించే పొరుగు రాష్ట్రమైన ఛత్తీజ్‌గడ్‌లో సత్కారం జరగడం సంతోషంగా ఉందన్నారు. సభ అనంతరం త్రినాథరావు తన మధురమైన పాటలతో ప్రేక్షకులను అలరించారు. జానపద కళాకారులు, నటరాజ్ భట్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఆచార్యులు శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్ నట్నాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## స్వామి రామానంద తీర్థ 53వ వర్ధంతి



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి,పి.వి .ప్రభాకర్‌రావు తదితరులు.

**బేగంపేట జనవరి 22,ప్రభాతవార్త**

బేగంపేట బ్రాహ్మణవాడీలోని శ్రీస్వామి రామానందతీర్థ లో బుధవారం స్వామి రామానంద తీర్థ 53వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ సురభి వాణీదేవి ముందుగా స్వామీజీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.పి.వీ.ప్రభాకర్ రావు కూడా స్వామిజీకి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ప్రార్ధనలు, త్యాగరాజ కీర్తనలు,దీపారాధన జరిగాయి.పి.వీ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ పి.వీ.ప్రభాకర్‌రావు,సురభి సోలార్ ఎనర్జీ డైరెక్టర్ శేఖర్ మారంరాజు,ప్రిన్సిపాల్ వాసుకి,ఆరుణశ్రీ ఉపాధ్యాయులు,చిన్నారులు పాల్గొన్నారు.

## అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తాం : డిప్యూటీ మేయర్

**నిజాంపేట్, జనవరి 22, ప్రభాతవార్త**



వార్డు సభ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్

అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ అన్నారు. బుధవారం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో 9వ డివిజన్ నిజాంపేట్ భవ్యస్ క్లబ్ హౌస్, 15వ డివిజన్ రాజీవ్ గాంధీ నగర్ నల్ల పోచమ్మలో ప్రజా పాలనా వార్డు సభలో ముఖ్య అతిథులుగా డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ పాల్గొని 9వ డివిజన్ కార్పొరేటర్ రజిత రవికాంత్, 15వ డివిజన్ కార్పొరేటర్ గాజుల సుజాత, 20డివిజన్ కార్పొరేటర్ బాలాజీ నాయక్, కోఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీష్‌లతో కలిసి వార్డ్ సభను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్లు, స్థలం ఉన్న నిరుపేద కుటుంబాలకు ఇంటి నిర్మాణానికి 5లక్షల ఆర్థిక సహాయం, 9, 10,11వ డివిజన్‌లో అర్హులైన నిరుపేద కుటంబాలకు రేషన్ కార్డులు 128మంది గుర్తింపు, ఇల్లు స్థలం ఉన్న నిరుపేద కుటుంబాలకు ఇంటి నిర్మాణానికి 5 లక్షల ఆర్థిక సహాయంగా 1 ఒక్కరు గుర్తింపు, అదేవిధంగా 74 మందికి ఇందిరమ్మ ఇండ్లు, అనంతరం 15వ డివిజన్‌లో అర్హులైన నిరుపేద కుటంబాలకు రేషన్ కార్డులు 325 మంది గుర్తింపు, ఇల్లు స్థలం ఉన్న నిరుపేద కుటుంబాలకు ఇంటి నిర్మాణానికి 5 లక్షల ఆర్థిక సహాయంగా 72 మంది గుర్తింపు, అదేవిధంగా 505 మందికి ఇందిరమ్మ ఇండ్లు అర్హులుగా గుర్తించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంఆర్ఓ ప్రభుదాస్, ఏఈలు గన్న ప్రసన్న, ప్రవీణ్, ఆర్వో రమేష్, వార్డు ఆఫీసర్‌లు లోహిత, యశ్వంతి, వెంకట్, శ్రీకాంత్, పవన్, యువ నాయకులు ఆనంద్ రెడ్డి, స్థానిక నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతో నిలిచిన అభివృద్ధి పనులు : కౌన్సిలర్ క్రిష్ణయాదవ్



విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న కౌన్సిలర్ జక్కుల క్రిష్ణయాదవ్

**దుండిగల్, జనవరి 22 ప్రభాతవార్త:** అధికారుల నిర్లక్ష్యంతో అనేక అభివృద్ధి పనులు నిలిచిపోయాయని దుండిగల్ పురపాలిక సంఘం 3వ వార్డు కౌన్సిలర్ జక్కుల క్రిష్ణయాదవ్ ఆరోపించారు. తన వార్డు పరిధిలో మైనార్టీ కమ్యూనిటీహాల్ భవనంకు భూమి చేయడంపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో బుధవారం ఆయన నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా క్రిష్ణయాదవ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ముస్లీం సోదరులకు కమ్యూనిటీహాల్ ఏర్పాటుకు హామినిచ్చానన్నారు. అందులో భాగంగా 2023లో కమ్యూనిటీ హాల్ రూ,20లక్షలు, 2024 రూ,20లక్షలు బడ్జెట్‌లో కేటాయిస్తూ కౌన్సిల్ తీర్మానం చేసిందన్నారు. బడ్జెట్ కేటాయింపు జరిగినప్పటికి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి టెండర్ ప్రక్రియను జాప్యం చేశారన్నారు. తమ పదవి కాలం ముగియనున్న నేపథ్యంలో మంగళవారం భూమిపూజ కోసం కమీషనర్ సత్యనారాయణరావు ఆహ్వానించాము. ఆయన వార్డుసభలు ఉన్నందున్న రాలేనని మీరు స్థానిక కౌన్సిలర్ మీరు చేయండి అని పేర్కొనడంతో కొబ్బరికాయ కొట్టడం జరిగిందన్నారు. తన వార్డు పరిధిలో అభివృద్ధి పనులు విషయంలో అధికారులు ప్రతిసారి నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తూ వస్తున్నారు. అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు సకాలంలో స్పందించకుంటే విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకేళ్తామని పేర్కొన్నారు. పేదప్రజల అభివృద్ధికి సహకరించాల్సిన అధికార పార్టీ నేతల తప్పుడు ప్రచారాలు చేయడం, అభివృద్ధి పనులను ఆటంకం కలిగించడం మంచి పద్ధతి కాదన్నారు. తాను ఏనాడు తప్పు చేయలేదని ప్రజాసమస్యల పరిష్కారామే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ముస్లీం మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డి సారధ్యంలోనే వర్గీకరణ సాధ్యం : పిడమర్తి రవి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున ్న పిడమర్తి రవి

**సైఫాబాద్, జనవరి 22 ప్రభాతవార్త:** ఫిబ్రవరి 2వ తేదీన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగే మాదిగ యువగర్జన్ బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి యువతకు పిలుపునిచ్చారు. తెలంగాణ దళిత దండు కార్య నిర్వాహక అధ్యక్షుడు మొగులయ్య ఆధ్వర్యంలో ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్‌లోని డా.బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం ఎదుట ఈ సభకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. మాదిగలు డప్పులు కొట్టె కార్యక్రమాన్ని, చెప్పులు కుట్టె కార్యక్రమాన్ని బంద్ చేసి భారత రాజ్యాంగాని ్న పట్టుకోవాలని దాని ద్వారానే మన హక్కులు వస్తాయని చెప్పారు. ఆదే విధంగా మాలల వైపున, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, మాదిగలవైపున ఎంఆర్‌పిఎస్ నాయకుడు మంద కృష్ణమాదిగ ఇద్దరి మాటలను మాల, మాదిగలు వినరాదని, సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఎస్సీ రిజర్వేషన్ వర్గకరణ సాధ్యమని మాదిగలకు 12 శాతం రిజర్వేషన్‌లు జిల్లాల వారిగా వర్గీకరణ చేయాలనే డిమాండ్‌తో ఫిబ్రవరి 2వ తేదీన జరిగేలో అధిక సంఖ్యలో యువత పాల్గొనాలని పిలుపునిచ్చారు. కృష్ణమాదిగ వర్గీకరణ చేసుకోలేక ముఖ్యమంత్రిని కలవకుండా పిఎం నరేంద్రమోదీని కలవాలని, బిజెపితోనే మాట్లాడుకోవడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో వర్గీకరణ చేసేది సిఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వమని స్పష్టం చేశారు. సిఎం ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలను ఉద్యమకారులుగా గుర్తించి 250 స్థలాన్ని గాని ఇందిరమ్మ ఇల్లుగాని, హైదరాబాద్‌లో డబుల్ బెడ్‌రూంలు మాదిగలకు వచ్చే విధంగా కృష్ణమాదిగ, సిఎంతో మాట్టాడాల్సింది పోయి సిఎంను రాజకీయంగా అంతం చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో నాయకులు వక్కలగడ్డ సోమచంద్రశేఖర్, బోమ్మల స్టాలిన్;జోగారావు, బొరెల్లి సురేష్ పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగం చాలా గొప్పది : డాక్టర్ హేమలత



ప్రసంగిస్తున్న జిహెచ్ఎంసి సహాయ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హేమలత


**చిక్కడపల్లి, జనవరి 22 ప్రభాతవార్త:** భారత రాజ్యాంగం చాలా గొప్పదని, రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అని జిహెచ్ఎంసి సహాయ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హేమలత అన్నారు. హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో బుధవారం రాంనగర్, నల్లకుంట డివిజన్ల జోన్ స్థాయి హై స్కూల్ విద్యార్థుల పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి ప్రసంగించారు. డాక్టర్ హేమలత మాట్లాడుతూ పిల్లలలో దేశభక్తిని పెంపొందించడానికి, సమాజ అవగాహన పెంచడానికి హైదరాబాద్ జిందాబాద్ మంచి ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. పిల్లలందరూ బాగా చదువుకోవాలని, రాజ్యాంగాన్ని హక్కులను తెలుసుకోవాలని, రాజ్యాంగాన్ని కాపాడాలని ఉన్నారు. ఇరిగేషన్ రిటైర్డ్ గెజిటెడ్ ఆఫీసర్ భవాని శంకర్ మాట్లాడుతూ రాజ్యాంగం భిన్నత్వంలో ఏకత్వం అని, అన్ని మతాల ఐక్యత మన ప్రత్యేకత అని అన్నారు. సామాజిక సేవకులు వాకర్స్ క్లబ్ నాయకులు రాజశేఖర్ మాట్లాడుతూ మానవ సేవనే మాధవసేవ అని, అందరూ సమాజం కోసం కొంత నైనా సాయం చేసే విధంగా మంచి అలవాట్లు నేర్చుకోవాలని, దేశభక్తిని పెంపొందించుకోవాలని అన్నారు. హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి వీరయ్య మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వజ్రోత్సవాల సందర్భంగా హై స్కూల్ విద్యార్థుల పోటీలు నగరవ్యాప్తంగా 100 స్కూల్లలో నిర్వహిస్తున్నామని అన్నారు. అందులో భాగంగా రాంనగర్, నల్లకుంట డివిజన్ల జోన్ స్థాయి ఈరోజు పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. జోనల్ స్థాయిలో గెలుపొందిన విజేతలకు ఫిబ్రవరి 2న జరిగే కల్చరల్ ఫెస్టివల్ రవీంద్ర భారతిలో ప్రముఖుల చేత బహుమతులు సర్టిఫికెట్లు ఇవ్వబడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర రావు, మోహన్ నాయుడు, శ్రీనివాసరావు, సంగీత, సైదులు, మేఘన, సుకుమార్, మహేందర్, రమేష్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## అవమానాలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా సభలు



సభలో మాట్లాడుతున్న విజిఆర్ నారగోని

**సైఫాబాద్, జనవరి 22 ప్రభాతవార్త:** ఒకప్పుడు అవమానాలు సమాజపరంగా గుడి, బడి, వీధుల్లో, గ్రామాల్లో అవమానాల్లో జరిగేవని, ప్రస్తుతం ప్రతి అగ్రకుల పార్టీలు, ప్రభుత్వాల ద్వారా, ప్రభుత్వ కార్యాలయాల ద్వారా బహుజనులు అడుగడుగున గురవుతున్నారని బిసినేత విజిఆర్ నారగోని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ పీపుల్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో బుధవారం నాడిక్కడ జరిగిన 'అవమానాల సభ'లో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. అవమానాలు భరిస్తున్న వారిని ఏకం చేయడానికే ఇలాంటి సభలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు ఎం.సూర్యనారాయణ, పి.మహేష్, నూరల్ అమిన్, సి.హెచ్.బాలకృష్ణ, సలీం భాషా, చలసాని శ్రీనివాస్, కె.బి.శ్రీధర్, రామనర్సయ్య పాల్గొన్నారు.



కాలుష్య నియంత్రణ మండలి ఉద్యోగుల ఆధ్వర్యంలో విడుదల చేసిన కొత్త క్యాలెండర్ చిత్రంలో సంఘ అధ్యక్షులు శ్రీవాత్సవ్ ,కార్యదర్శి కృపానంద్,సభ్య కార్యదర్శి జి.రవి ,ఇతర అధికారులు బి రాఘు,డాక్టర్ ఎం.సత్యనారాయణ,హన్మంత్ రెడ్డి,వినయ్ కుమార్ నాయుడు ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత...

**బేగంబజార్,జనవరి 22 ప్రభాతవార్త:** 11 కెవి బేగంబజార్ విద్యుత్ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా బుద వారం ఉదయం10గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు బేగంబజార్ సిబిడి ఎ.డి.ఇ వెంకటేశ్వర్లు తెలిపారు.బేగంబజాం ఛత్రి,సెవెన్ ఎవెన్‌హోటల్,కంటి ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. కాగా ఇఎన్‌టి 11కెవి ఫీడర్ మరమ్మత్తుల కారణంగా ఉదయం 10గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఎంజిబిఎస్,అఫ్జల్‌గంజ్,బస్సుస్టాండ్ తదితర ప్రాంతాలల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని నిలిపివేస్తున్నట్లు బేగంబజార్ సిబిడి ఎ.డి.ఇ వెంకటేశ్వర్లు తెలిపారు.

## మార్చిలో మిస్‌ట్రాన్స్ పేరుతో ఫ్యాషన్‌షో

**హైదరాబాద్, జనవరి 22**

**,ప్రభాతవార్త:**

ఐకానిక్ స్టార్స్, మిస్ ట్రాన్స్ తెలంగాణ పేరుతో మార్చిలో ఫ్యాషన్ షో ఐకానికి స్టార్స్ మిస్ ట్రాన్స్ తెలంగాణ పేరుతో మార్చి 9న ఫ్యాషన్ షో నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు శ్రీనాథ్, వంశీ పల్లె తెలిపారు. బుధవారం ప్రెస్ క్లబ్ లో జరిగిన మీడియా సమావేశంలో ట్రాన్స్ జెండర్స్ డాక్టర్ ప్రాచి రాథోడ్, హర్షిని తో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా హర్షిని మాట్లాడుతూ ఫ్యాషన్ షోలో పాల్గొనే వారు 18 నుంచి35 ఏళ్ల లోపు ఉండాలన్నారు. ఇప్పటివరకు ట్రాన్స్ జెండర్స్ తో ఫ్యాషన్ షో ఎప్పుడు నిర్వహించ లేదన్నారు. ఫ్యాషన్ షోలో పాల్గొనదలచిన వారు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఈసమావేశంలో బన్నీ రాథోడ్, చంద్ర స్వామి, నవీన్ గౌడ్, కమల్ గౌడ్ పాల్గొన్నారు.

## సాగు చేసుకునే రైతులకు రైతు భరోసా



**వనస్థలిపురం. జనవరి. 22.(ప్రభాతవార్త).** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్ నగర్ సీతా రామాంజనేయ కళ్యాణ మండపంలో ప్రజాపాలనలో భాగంగా నిర్వహించిన రైతు భరోసా కార్యక్రమానికి బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి , హయత్ నగర్ ఎమ్మార్వో జానకి , అగ్రికల్చర్ ఆఫీసర్ సులేమాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ...26వ తేదీ నుంచి అమలు చేయాలని నిర్ణయించిన రైతు భరోసా పథకానికి సంబంధించి.. ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేశారని అన్నారు. సాగు చేసుకునే రైతులకు మాత్రమే రైతు భరోసా నిధులను విడుదల చేయడం జరుగుతుందన్నారు.ఉదాహరణకు రెండు ఎకరాల సాగు పొలం ఉండి పరిస్థితులు బాగోలేక ఒక ఎకరం అమ్ముకొని ఇంకో ఎకరం సాగు చేసుకునే రైతులకు కూడ రైతు భరోసా పథకం లబ్ది పొందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్వేత, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నర్సింగ్ యాదవ్, రమేష్ మరియు పార్టీ డివిజన్ బిజెపిప్రధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేవైఎం సెక్రటరీ పవన్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ చేయూత



**తుర్కయంజాల్ జనవరి 22,ప్రభాతవార్త** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాగన్నగూడ లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఎవరెస్ట్ వారి సౌజన్యంతో సౌండ్ సిస్టం ను ఉపాధ్యాయులకు సంధ్యా పరమేష్ లు బుధవారం అందజేశారు. క్రీడా పరికరాలను లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఎవరెస్ట్ వారు అందజేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకల బహుమతులకు 5 వేల రూపాయలను ను లయన్ అరవింద్ అందజేశారు. సహాయ సహకారాలను అందించిన వారికి విద్యార్థులు తరఫున ఉపాధ్యాయుల బృందం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జ్యోతి బుధవారం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలకు ఇలాంటి ప్రోత్సాహకాలు అందజేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం నుండి ప్రోత్సాహం అందితే కార్పొరేట్ కు దీటుగా ఉత్తమ ఫలితాలను సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనురాధ , వరలక్ష్మి ,సంధ్యా ,లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఎవరెస్ట్ క్లబ్ హైదరాబాద్ బృందం, లైన్స్ క్లబ్ ఆఫ్ రాగన్నగూడ సభ్యులు, జడ్పీహెచ్ఎస్ రాగన్నగూడ ఇన్చార్జి హెచ్ఎం యాదయ్య , విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

### యువతలో నైపుణ్యాలను పెంపొందించడానికి కృషి : సుధీర్ కుమార్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సుధీర్ కుమార్, సునంద దేవి పాండే, లయన్ రవీందర్ తదితరులు

**మలక్ పేట ,జనవరి 22, ప్రభాతవార్త:** యువతలో నైపుణ్యాలను పెంపొందించడానికి కృషి చేస్తున్నామని వెల్ స్పన్ గ్రూప్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్, హెచ్. ఆర్ హెడ్ సుధీర్ కుమార్ పేర్కొన్నారు. దిల్సుక్నగర్ చేతనే పూరీలోని సంస్థ కార్యాలయంలో వెల్ స్పన్ ఫౌండేషన్, ఏఐఎస్ఇసిటి సహకారంతో యువతలో నైపుణ్య అభివృద్ధి, ఉపాధి అవకాశాల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవితంలో నైపుణ్యం మనదే ఎంతో ముఖ్యమైనది అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సురేఖ, హెచ్. ఆర్ మేనేజర్ సునంద దేవి పాండే, జోనల్ కోఆర్డినేటర్ విపుల్ శర్మ, లయన్ జి.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

### మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన



సందీప్ సాలియాకు జ్ఞాపికను అందజేస్తున్న విజయరంగ

**ఎల్.బి.నగర్, జనవరి 22 ప్రభాతవార్త:** మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి తాము ముందుంటామని లయన్స్క్లబ్ హెల్త్ క్యాంప్ జిల్లా చైర్మన్ డాక్టర్ బి.విజయరంగ తెలిపారు.పోలీస్ కమాండర్ కంట్రోల్లో రాష్ట్ర అంటి నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ సాలియా, ఐపీఎస్ అధికారి సాయిచైతన్యని ఆయన బుధవారం డాక్టర్ కొట్టం జంగయ్యయాదవ్, లయన్స్క్లబ్ కొత్తపేట అధ్యక్షులు కర్ణ శ్రీనివాస్లతో వారిని కలిసి విజయరంగ జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.మాదక ద్రవ్యలు, మత్తుపదార్థాల వినియోగంతో తెలంగాణ రాష్ట్రంలో యువత పెడదొవ పట్టకుండా అవగాహన కల్పించే విషయమై అధికారులతో చర్చించామని విజయరంగ తెలిపారు. మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాల విషయమై యువతకు అవగాహన కల్పించడానికి లయన్స్క్లబ్ సబ్యులలో కొంతమందిని ఎంపిక చేసి వారికి అవగాహన కల్పించడంతోపాటు శిక్షణ శిబిరాలను అంటి నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు.

### సుప్రజా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆరోగ్య సదస్సు



సంగ్రామ్కు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**ఎల్.బి.నగర్, జనవరి 22 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో సుప్రజా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. అదేవిధంగా పలువురికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుప్రజా ఆసుపత్రి మేనేజర్ రాజేందర్గౌడ్ పాల్గొని ఆరోగ్యపరమైనటువంటి ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. సుప్రజా ఆసుపత్రిలో ఉచితంగ బీపీ, షుగర్, బ్లడ్ టెస్ట్ లాంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మహిళలకు గైనిక్ సంబంధించిన పరీక్షలు ఉచితంగా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పవన్ కుమార్, డివిజన్ బిజెపి అధ్యక్షుడు మంచి రాజేష్, సంగ్రామ్, శివ నేత, రామకృష్ణ పాల్గొన్నారు.

## మల్కాజిగిరిలో అనధికారిక విద్యుత్ కోతలతో అవస్థలు



**మల్కాజిగిరి జనవరి.22.ప్రభాతవార్త :** మల్కాజిగిరి ట్రాన్స్కొ ఏడి పరిధిలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ముందస్తు సమాచారం లేకుండా అనధికార విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మల్కాజిగిరి ఏడి పరిధిలోని వసంతపురి సెక్షన్లో బుధవారం ముందస్తు సమాచారం లేకుండా అనధికారికంగా అరగంటకు పైగా విద్యుత్ కోత విధించడంతో పలువురు ఇబ్బందులు పడ్డారని పలు కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు పేర్కొన్నారు బుధవారం వసంతపురి సెక్షన్లో వాణి నగర్ లోని ఐశ్వర్య అపార్ట్మెంట్ కోసం విద్యుత్ నిలిపివేశామని సంబంధిత ఏయి చెప్పడం గమనార్హం. విద్యుత్ కోతులపై ఏడిఈ వివరణ కోసం ప్రయత్నిస్తే అతని ఫోన్ స్విచ్ ఆఫ్ చేశారు. అనధికారిక విద్యుత్ కోతలపై సంబంధిత డి ఇ ఈ వివరణ కోరగా తనకు ఎలాంటి సమాచారం లేదని విద్యుత్ కోతలు లేవని తెలిపారు . లెవెన్ కె.వి మెయిన్ లైన్ నిలిపి వేయడానికి ఎలాంటి ముందస్తు అనుమతులు తీసుకోలేదని ఆయన తెలిపారు. మల్కాజిగిరి ఏడిఈ పరిధిలో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఉన్నతాధికారి అనుమతులు లేకుండా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని దీనిపై ఉన్నతాధికారి చర్యలు తీసుకోవాలని మన సంక్షేమ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు

## అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తాం : ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

**అబ్దుల్లాపూర్మెట్, జనవరి 22 ప్రభాతవార్త:** తమది ప్రజాప్రభుత్వమని... అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి అన్నారు. ప్రజాపాలనలో భాగంగా బుధవారం ఆయన అబ్దుల్లాపూర్మెట్ మండలం అనాజ్పూర్ గ్రామం లో నిర్వహించిన గ్రామసభకు హాజరై ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహాలక్ష్మి, గృహజ్యోతి, గ్యాస్సబ్సిడీ, రైతు రుణమాఫి వంటి పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి రేషన్కార్డులను అందిస్తామని, ఇల్లులేనివారికి ఇందిరమ్మ ఇళ్లు, భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, భూమి ఉన్న రైతులకు సాగుకోసం రైతుభరోసా కింద ఎకరానికి 12వేల రూపాయలను అందించనున్నట్లు తెలిపారు. . కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్రెడ్డి, వైస్చైర్మన్ భాస్కరాచారి, తహశీల్దార్ సుదర్శన్రెడ్డి, మాజీ జడ్పీటీసీ బింగిదాసుగౌడ్, ఎంఆర్ఆర్ యువసేన అధ్యక్షుడు బుర్రమహేందర్గౌడ్, గ్రామకార్యదర్శి సూరిబాబు, ఏఈ నరేందర్ పాల్గొన్నారు.

**పెద్దఅంబర్పేటలో...**

పెద్దఅంబర్పేటలోని ఆయా వార్డులలో వార్డుసభలను నిర్వహించిన అధికారులు ప్రజల నుంచి రేషన్కార్డులు, రైతు భరోసాలకు సంబంధించిన దరకాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా 9వ వార్డులో కౌన్సిలర్ చల్లూరి మురళీధర్రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్పర్సన్ పండుగుల జయశ్రీరాజు, కమిషనర్ రవీందర్రెడ్డి మాట్లాడుతూ... గతంలో ప్రజా పాలనలో స్వీకరించిన దరకాస్తులతో పాటు ప్రస్తుతం తీసుకుంటున్న ధరకాస్తులను విచారించి అర్హులకు పథకాలు అందేలా చూస్తామన్నారు. సరైన వివరాలను నమోదు చేసి వార్డుసభలలో లేదా మున్సిపల్ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్లో ధరకాస్తులను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా కాలనీల ప్రతినిధులు నక్క సంజీవ్గౌడ్, ఎన్నెపల్లి మధుసూదన్రెడ్డి, నక్కల రవీందర్రెడ్డి పాల్గొన్నారు.

## ప్రగల్భాలు మానుకొని నిధులు కేటాయించండి : బిజెపి అధికార ప్రతినిధి బిబిఆర్ వేణు



సమావేశంలో మాట్లాడుతున్న బిబిఆర్.వేణు

**ఎల్.బి.నగర్, జనవరి 22 ప్రభాతవార్త:** హైదరాబాద్ మహానగరాన్ని ఇస్తాంబుల్, డల్లాస్ చేస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రగల్బాలు పలుకుతున్నారని, జిహెచ్ఎంసిల వీధిలైట్లు పోతే పట్టించుకునే నాథుడే కురువయ్యాడని తెలంగాణ రాష్ట్ర బిజెపి ఓబిసి మోర్చా అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ బిబిఆర్ వేణు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్కేపురంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ..ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని జిహెచ్ఎంసి ప్రాంతాలలో వీధి లైట్లు వెలగడం లేదన్నారు. ఇదే విషయాన్ని అధికారులను అడిగితే ఈఈఎస్ఎల్ అనే ఏజెన్సీ నిర్వహణ చేస్తున్నదని వారికి బిల్లులు ఆపేయడంతో, మూడు నెలల నుండి ఈ ఏజెన్సీ ఎక్కడ కూడా వీధిలైట్లు కాలిపోయిన, వెలగకపోయినా పట్టించుకోవడం మానేసిందన్నారు. ప్రభుత్వం డబ్బులు చెల్లించడం లేదు కాబట్టి మేము పనిచేయడం ఆపివేశామని చెప్పున్నారని అన్నారు. కాలనీలలో బస్తీలలో లైట్లు వెలగక మూడు నెలలుగా అంధకారం నుంచి జిహెచ్ఎంసి కమిషనర్, సంబంధిత మంత్రిగానీ పట్టించుకున్న పాపనా పోలేదని విమర్శించారు. ప్రపంచంలోనే హైదరాబాదును ఉన్నత స్థానంలో నిలబెడుతానాని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రగల్భాలు పలుకుతున్నాడని ఎద్దేవ చేశారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిజెపి పార్టీ హైదరాబాద్ పట్టణ ప్రజలతో కలిసి జిహెచ్ఎంసి కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు అందివ్వడానికే ప్రజాపాలన వార్డు సభలు : మేయర్ పారిజాత



ప్రజాపాలన వార్డు సభలో దరఖాస్తులు తీసుకుంటున్న మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ శేఖర్, కమిషనర్ సరస్వతి, కార్పొరేటర్ స్వప్న

**సరూర్నగర్, జనవరి 22 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ పేదల పక్షపాతి అని బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం కార్పొరేషన్లోని బడంగ్పేట్, అల్మాస్గూడలకు సంబంధించిన వివిధ డివిజన్లలో ప్రజాపాలన వార్డు సభలు జరిగాయి. ఈ సందర్భంగా హాజరైన మేయర్ మాట్లాడుతూ అర్హులైన వారందరికీ కొత్త రేషన్కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా తదితర సంక్షేమ పథకాలను ఇవ్వడానికి ప్రభుత్వం ప్రజాపాలన వార్డు సభలను నిర్వహిస్తున్నదని తెలిపారు. ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి ప్రజాపాలన సభల్లోనే అర్హులను ప్రకటించడం సంతోషకరమని అన్నారు. అదే విధంగా డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ కూడా ప్రజాపాలన సభలో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ పి.సరస్వతి, కార్పొరేటర్లు సూర్ణగంటి అర్జున్, పెద్దబావి శోభ ఆనంద్రెడ్డి, భీమిడి స్వప్న జంగారెడ్డి, పెద్దబావి సుదర్శన్రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, గౌర రమాదేవి శ్రీనివాస్, పలువురు అధికారులతో పాటు నాయకులు గట్టు బాలకృష్ణ, పెద్దబావి బాబు సుదర్శన్రెడ్డి, నయనాచారి, బొల్లపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు భద్రతపై లారీ యజమానులకు అవగాహన



రోడ్డు నిబంధనలపై లారీ యజమానులకు అవగాహన కల్పిస్తున్న రవాణాశాఖ అధికారి కె.రవీందర్రెడ్డి తదితరులు

**ఉప్పల్, జనవరి 22 ప్రభాతవార్త :** రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని ఉప్పల్ రవాణాశాఖ అధికారి కె.రవీందర్రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ మాడ్రన్ వద్ద రామంతాపూర్ లారీ యజమానులకు రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వేగం కన్నా ప్రాణాలు ముఖ్యమని, మద్యం సేవించి వాహనాలు నడిపించవద్దని కోరారు. ట్రాఫిక్ సిఐ లక్ష్మి మాధవి మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వాహనాలు నడిపించవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. శిక్షణ పొందిన వాలంటీర్లను వివిధ జంక్షన్ల వద్ద విధులలో వాడుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ శ్రీనివాస్, కిరణ్కుమార్,రామంతాపూర్ లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు అధ్యక్షుడు ప్రతాప్రెడ్డి, సత్తయ్య, బండ అంజయ్య, సైదులు, గుత్తి శేఖర్ కురుమ, యాదయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులను కాలనీ ప్రతినిధులు పర్యవేక్షించాలి : చైర్పర్సన్**

**హయత్నగర్, జనవరి 22 ప్రభాతవార్త:** కాలనీ ప్రతినిధులు శ్రద్ధ వహించి అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించడం అభినందనీయమని పెద్దఅంబర్పేట మున్సిపాలిటీ చైర్పర్సన్ పండుగుల జయశ్రీరాజు అన్నారు. మున్సిపాలిటీ పరిధి 9వ వార్డు శ్రీసాయికుటీర్లో కొనసాగుతున్న కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను ఆమె బుధవారం కమిషనర్ రవీందర్రెడ్డి, స్థానిక కౌన్సిలర్ చల్లూరి మురళీ ధర్రెడ్డితో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆయా కాలనీలలో ప్రజల అవసరార్థం కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు నిధులను కేటాయిస్తున్నామని తెలిపారు. కాంట్రాక్టర్లను సమన్వయం చేసుకుని కమ్యూనిటీ హాళ్ల నిర్మాణంలో నాణ్యతను పాటించేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నక్క సంజీవ్గౌడ్, కమ్యూనిటీ హాల్ నిర్మాణ కమిటీ కన్వీనర్ మధుసూదన్రెడ్డి, ప్రతినిధులు గుణంగారి ఉపేందర్రెడ్డి పాల్గొన్నారు.

### కర్ణాటక రెడ్డి జనసంఘ ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న మల్రెడ్డి రాంరెడ్డి




**తుర్కయంజాల్ జనవరి 22 ప్రభాతవార్త**

కర్ణాటక రెడ్డి జనసంఘం (ఆర్) ఆధ్వర్యంలో బెంగళూరులో జరిగిన ప్రత్యేక సమావేశంలో రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్రెడ్డి రాంరెడ్డి క్రెడాయి చైర్మన్, తిరుపతి బిల్డింగ్ కమిటీ చైర్మన్ మురళీ కృష్ణా రెడ్డి,మాజీ జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి సంఘం ప్రత్యేక ఆహ్వానం మేరకు హాజరయ్యారు. ఈ సమావేశంలో కర్ణాటక రెడ్డి జనసంఘ అధ్యక్షులు జయరాం రెడ్డి , జనరల్ సెక్రటరీ శేఖర్ రెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.సభ ప్రారంభంలో మల్రెడ్డి రాంరెడ్డి, మురళీ కృష్ణా రెడ్డి సందీప్ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆత్మీయ ఆహ్వానం అందుకున్న అతిథులు సంఘానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, ఇలాంటి కార్యక్రమాలు సంఘం ఐక్యతను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

### బడంగ్పేట్ 5వ డివిజన్ కాలనీల్లో బిటి రోడ్డు పనులకు శ్రీకారం

**సరూర్నగర్, జనవరి 22 ప్రభాతవార్త:** బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్లోని 5వ డివిజన్లో బుధవారం బిటి రోడ్డు నిర్మాణపు పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ బోయపల్లి దీపికా శేఖర్రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు హాజరైన మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి డివిజన్లోని వినాయకహిల్స్ కాలనీ, ఫేస్-2 కాలనీ, రామిడి హిల్స్ కాలనీల్లో బిటి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎదుళ్ళ ప్రతాప్రెడ్డి, అయోధ్యచారి, శ్రీనివాస్రెడ్డి, కృష్ణయాదవ్, వినోద్ నాయక్, రంజిత్రెడ్డి, సురేందర్రెడ్డి, మల్లేష్ యాదవ్, శ్రీనివాస్రెడ్డి, సోమయ్య యాదవ్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## ఐఎస్ సదన్ బిజెపి అధ్యక్షుడిగా గిరిధర్రెడ్డి



డివిజన్ అధ్యక్షుడు గిరిధర్రెడ్డిని సన్మానిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్రెడ్డి

**సైదాబాద్, జనవరి 22 ప్రభాతవార్త:** యాకుత్పుర నియోజకవర్గంలోని ఐఎస్ సదన్ డివిజన్ బిజెపి అధ్యక్షుడిగా గంగిరెడ్డి గిరిధర్రెడ్డి రెండవ సారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా గిరిధర్రెడ్డి మాట్లాడుతూ ఐఎస్ సదన్ డివిజన్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను డివిజన్లోని అర్హులైన వారందరు సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తానని అన్నారు. తనను రెండవ సారి అధ్యక్షుడిగా ఎంపిక చేసిన పార్టీ నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నూతనంగా ఎంపికైన అధ్యక్షుడు గిరిధర్రెడ్డిని కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మన్నె శ్రీనివాస్, అమర్నాథ్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి : కార్పొరేటర్



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్రెడ్డి

**సైదాబాద్, జనవరి 22 ప్రభాతవార్త :** సైదాబాద్ డివిజన్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్రెడ్డి అధికారులకు సూచించారు. క్రాంతి నగర్లో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన అనంతరం కార్పొరేటర్ కొత్తకాపు అరుణ మాట్లాడుతూ క్రాంతి నగర్లో ఇప్పటికే డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని, ప్రస్తుతం నూతన రోడ్డునిర్మాణం చేపడుతున్నామని అన్నారు. డివిజన్లోని అన్ని కాలనీలు, బస్తీలలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ వెంకన్న, వర్క్ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్, కాలనీవాసులు కావేటి శర్మ, కావేటి దిలీప్, కృష్ణ, ముద్రకోళ్ల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

### వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి




సమావేశంలో ప్రసంగిస్తున్న కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, చిత్రంలో సంస్థ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖదిర్ తదితరులు

**మలక్ పేట ,జనవరి 22, ప్రభాతవార్త:** వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని లోటస్ ల్యాబ్ విద్యాసంస్థల చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. మలక్ పేట నల్గొండ చౌరస్తా లోని సిమ్లా గార్డెన్స్ లో స్కై సే సంస్థ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖదిర్, మేనేజింగ్ డైరెక్టర్ సాజిదాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వస్తువుల క్రయవిక్రయాలలో డిజిటల్ చెల్లింపుల ప్రాధాన్యత రోజు రోజుకి పెరుగుతుందని అన్నారు. హైదరాబాద్ కేంద్రంగా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అంతర్జాతీయ స్థాయి డిజిటల్ చెల్లింపు యాప్ ను స్కై సే వారు ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు. స్కై సే లిమిటెడ్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదిర్ మాట్లాడుతూ తమ యాప్ ద్వారా వినియోగదారులకు బహుళ ప్రయోజనాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి వినియోగదారుడు ఆర్థికంగా స్థిరపడాలని లక్ష్యంతో ఈ యాప్ ను రూపొందించినట్లు ఆయన వివరించారు. అనంతరం పలువురు కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సాజిదా, లయన్ వీణ సరస్వతి, ప్రవీణ్, భాస్కర్, వంశీ కళ్యాణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రొఫెషనల్ క్రికెట్ లీగ్ పోటీలు




వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ ఇంద్రసేనారెడ్డి

**ఎల్.బి.నగర్, జనవరి 22 ప్రభాతవార్త:** యాంత్రిక జీవితంలో ఒత్తిడి నుంచి బయట పడడం కోసం క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉద్దేశంతో ప్రొఫెషనల్ క్రికెట్ లీగ్ మ్యాచ్లను నిర్వహిస్తున్నట్లు ఓజోన్ ఆసుపత్రి డైరెక్టర్,ప్రొఫెషనల్ క్రికెట్ లీగ్ చైర్మన్ డాక్టర్ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. కొత్తపేటలోని ఓజోన్ ఆసుపత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి తేదీ నుంచి ప్రొఫెషనల్ క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. పోటీలో పాల్గొనేవారు జనవరి 26వ తేదీ నుంచి తమ పేర్లను నమోదు చేసుకుంటే గ్రూప్ మ్యాచులు నిర్వహిస్తామన్నారు. క్రికెట్ ఆడటం వల్ల శరీరంలో అనేక మార్పులు రావడంతో పాటు ఉల్లాసంగా, ఆనందకరమైన వాతావరణం నెలకొంటుందన్నారు. ఎవరు ఏ రంగంలో ఉన్న స్నేహపూర్వక వాతావరణం లో జరిగే క్రికెట్ పోటీలో ఎంతో ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. పోటీలలో గెలుపు ఓటంలో సహజమే అని ఓటమి ద్వారా అనేక విషయాలు నేర్చుకుంటామన్నారు. క్రికెట్ ఆడటం వల్ల శారీరక పరిపుష్టి పెరగడంతో పాటు ఉత్సాహకరమైన వాతావరణం నెలకొంటుందని అన్నారు. డాక్టర్లు, న్యాయవాదుల పోటీలు ఇటీవలే ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. సమావేశంలో నిర్వాహకులు,వైద్యులు డి వి.రావు మధుసూదన్రెడ్డి, రంజిత్, అతిత్ పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



జడ్పీహెచ్ఎస్లో మాట్లాడుతున్న కార్పొరేటర్ నవజీవన్రెడ్డి

**హయత్నగర్, జనవరి 22 ప్రభాతవార్త:** ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలను పాటించి ప్రమాదాల నివారణకు తమవంతుగా కృషిచేయాలని హయత్నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్రెడ్డి అన్నారు. జాతీయ రహదారి భద్రతా మహోత్సవాలు-2025ని పురస్కరించుకుని హయత్నగర్లోని జడ్పీహెచ్ఎస్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకుని వారి తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలను నడపరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పతిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యంతాగి వాహనాలను నడపరాదని, కార్లు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని, సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపరాదని, రాంగ్రూట్లో వాహనాలను నడపరాదన్నారు. భద్రతా నియమాలు పాటించకపోవడంతో ప్రతి ఏడాది ఎంతోమంది విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించి సురక్షితంగా ఇళ్లకు చేరడం ద్వారా కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు జడ్పీహెచ్ఎస్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎంపీఐ అనుష, ఎస్సై లింగారెడ్డి పాల్గొన్నారు.

### మీర్పేట్ కార్పొరేషన్లో విజయవంతంగా ప్రజాపాలన వార్డు సభలు



ప్రజాపాలన వార్డు సభలకు హాజరైన మీర్పేట్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి

**సరూర్నగర్, జనవరి 22 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్లో ప్రజాపాలన వార్డు సభలు విజయవంతం జరుగుతున్నాయి. రెండవ రోజు బుధవారం కమీషనర్ ఆర్.జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో కార్పొరేషన్లోని 4, 5, 11, 12, 14, 18, 19, 25, 26, 32, 33, 39, 40, 45 డివిజన్లలో వార్డు సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు గతంలో దరఖాస్తులు చేసుకున్న వారిలో ఎంపికైన లబ్ధిదారుల జాబితాను ప్రకటించారు. అదే విధంగా కొత్తగా రేషన్కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం ప్రజల నుండి దరఖాస్తులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, మేనేజర్ చంద్రప్రకాశ్రెడ్డి, బాలాపూర్ మండల డిప్యూటీ తహసీల్దార్, పలువురు కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

### జిల్లెలగూడ వెంకన్న హుండీ ఆదాయం రూ.2,91,356



ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ ప్రణీత్, కార్పొరేటర్ రాజేందర్రెడ్డిల సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అర్చకులు, శ్రీవారి సేవకులు

**సరూర్నగర్, జనవరి 22 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ జిల్లెలగూడ గ్రామంలోనున్న చారిత్రక శ్రీదేవి భూదేవి సమేత మత్స్యావతార వెంకటేశ్వర స్వామి దేవాలయానికి సంబంధించిన 36 రోజుల హుండీ ఆదాయం రూ. 2,91,356 వచ్చింది. బుధవారం ఆలయంలో ఇఓ శ్రీనివాస్రెడ్డి ఆధ్వర్యంలో హుండీలను తెరిచి లెక్కించారు. స్థానిక కార్పొరేటర్ బొక్క రాజేందర్రెడ్డి, దేవాదాయ ధర్మాదాయ శాఖ రంగారెడ్డి జిల్లా తూర్పు విభాగం ఇన్స్పెక్టర్ ప్రణీత్, ఆలయ మాజీ ధర్మకర్తలు బొమ్మరబోయిన యాదగిరి ముదిరాజ్, చింతపట్ల జ్ఞానేశ్వరచారి తదితరుల సమక్షంలో ఆలయ పూజారులు, సిబ్బంది, శ్రీవారి సేవకులు హుండీ డబ్బులను లెక్కించారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 18 నుండి జనవరి 22 వరకు వచ్చిన హుండీ ఆదాయాన్ని లెక్కించగా మొత్తం రూ. 2,91,356 వచ్చింది. ఈ మేరకు నగదును ఇఓ ఆలయ అక్కౌంట్లో జమ చేయించారు.

### దేశాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలి



హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో జరిగిన జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రిటైర్ట్ ఐఎఎస్ డా.జనార్ధన్రెడ్డి తదితరులు

**ఉప్పల్, జనవరి 22 ప్రభాతవార్త :** దేశాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని రిటైర్ట్ ఐఎఎస్ అధికారి డా.జనార్దన్రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం రామంతాపూర్ పబ్లిక్ స్కూల్లో జరిగిన రోడ్డు భద్రతా వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జాతీయ విద్యావిధానం, రహదారి భద్రత అంశాలపై మరింత అవగాహన కల్పించుకోవాలని సూచించారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తూ జ్ఞాన సముపర్ధనతోపాటు, వివిధ అంశాలలో నైపుణ్యం సాదించాలని సూచించారు. దేశ జనాభాలో 20 శాతం మంది విద్యార్థులు పాఠశాల విద్యార్థులే ఉన్నారని, రహదారి భద్రత గురించి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరికి ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో అచార్యులు డా.సల్లారం నరసింహారెడ్డి, కల్నల్ కపూర ;దీపిక, పద్మావతి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఉప్పల్లో సిపిఎం రాష్ట్ర మహాసభల పోస్టర్ అవిష్కరణ

**ఉప్పల్, జనవరి 22 ప్రభాతవార్త :** సిపిఎం తెలంగాణ రాష్ట్ర మహాసభలు ఈనెల 25 నుంచి మూడు రోజుల పాటు సంగారెడ్డిలో జరుగుతాయని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు ఎం.వినోద, ఉప్పల్ కార్యదర్శి జె.వెంకన్న, సభ్యులు నాగరాజు, పెద్ద స్వామి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ సిపిఎం కార్యాలయం వద్ద మహాసభల పోస్టర్ అవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సిపిఎం మహాసభల సందర్భంగా సంగారెడ్డిలో జరిగే సమావేశానికి సిపిఎం పార్టీ పోలిట్బ్యూరో సభ్యులు బృందాకారత్, బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, జినాగయ్య, ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి తదితరులు పాల్గొంటున్నారని తెలిపారు. దేశ వ్యాప్తంగా జరిగే వివిధ అంశాలపై చర్చిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు జె.లలిత, కె.ఊర్మిళ, జె.ఉపేం దర్, పట్టాబిరామయ్య, మురళీమోహన్,రవి, గాయత్రి ,రవి పాల్గొన్నారు.